సత్యం, సమర్థత, విశ్వసనీయత

WWW.SAKSHYAM.COM

# సాక్ష్యం

తెలుగు దినపత్రిక

విజయవాడ | బుధవారం 13 మే 2026

సంపుటి: 17 | సంచిక: 132

పేజీలు: 08 | వెల: రూ.2:00

Published from Hyderabad, Vijayawada.


## కృష్ణా జలాల వినియోగంపై చర్చ

ఎపికి 10 , తెలంగాణకు 16 టిఎంసిల కేటాయింపు

హైదరాబాద్,మే12(సాక్ష్యం): ఏపీ, తెలంగాణ తాగునీటి అవసరాల మేరకు కృష్ణా జలాలను వినియోగించుకోవాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)



సమావేశంలో నిర్ణయించారు. హైదరాబాద్ లో జరిగిన కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశంలో ఇరు రాష్ట్రాల ఈఎన్‌సీలు, ఉన్నతాధి కారులు పాల్గొన్నారు. సాగర్‌లో ఆగస్టు 15 వరకు ఏపీకి 10 టీఎంసీల వినియోగానికి కేఆర్ఎంబీ అనుమతించింది. తెలంగాణకు సాగర్ నుంచి 16, శ్రీశైలం నుంచి 6 టీఎంసీల వినియోగానికి అంగీకారం తెలిపింది. ఏపీ ఇప్పటికే ఎక్కువ నీరు వాడుకుందని సమావేశంలో తెలంగాణ అధికారులు కేఆర్ఎంబీ దృష్టికి తీసుకెళ్లారు.



### బిఆర్ఎస్ ముఖ్యనేతలతో కేసీఆర్ భేటీ

పార్టీ సంస్థాగత నిర్మాణంపై ప్రధానంగా దృష్టి

గజ్వేల్,మే12(సాక్ష్యం): బీఆర్ఎస్ ముఖ్య నేతలతో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భేటీ దాదాపు ఆరు గంటలుగా కొనసాగింది. ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ వివిధ అంశాలపై పార్టీ నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు ప్రక్రియ,

మిగతా 2 లో..



### దేశంలో తగినన్ని ఇంధన నిల్వలు

ప్రస్తుతానికి లోటులేదన్న కేంద్రమంత్రి

న్యూఢిల్లీ,మే12(సాక్ష్యం): దేశంలో ఇంధన సరఫరాకు ఎలాంటి సమస్య లేదని, తగినన్ని క్రూడాయిల్ నిల్వలు ఉన్నాయని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి అన్నారు. సీఐఐ వార్షిక వాణిజ్య

మిగతా 2 లో..



### చెరువులు, సరస్సులు, వెట్‌ల్యాండ్స్ పరిరక్షణ

ప్రత్యేక దృష్టి సారించిన తెలంగాణ ప్రభుత్వం

అధికారులతో మంత్రి కొండా సురేఖ సమీక్ష

హైదరాబాద్,మే12(సాక్ష్యం): తెలంగాణ రాష్ట్రంలో చెరువులు, సరస్సులు, వెట్‌ల్యాండ్స్ పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల సమీక్షా సమావేశం మంగళవారం

మిగతా 2 లో..

# నీట్ ప్రవేశ పరీక్ష రద్దు

- పేపర్ లీక్ వ్యవహారంతో ఎన్‌టిఏ నిర్ణయం
- సిబిఐ విచారణకు ఆదేశించినట్లు వెల్లడి
- 13మందిని అరెస్ట్ చేసిన పోలీసులు



న్యూఢిల్లీ,మే12(సాక్ష్యం): జాతీయ అర్హత పరీక్ష నీట్ యూజీ-2026ను రద్దు చేసారు. పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నప త్రం రాజస్థాన్‌లో లీకైనట్లు వచ్చిన వార్తలు పెనుదుమారం రేపాయి. ఈ నేపథ్యంలో జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా మే 3న జరిగిన నీట్

మిగతా 5 లో..

### లక్షల మంది విద్యార్థుల కలలు కల్లలు

నీట్ పరీక్ష రద్దుపై మండిపడ్డ రాహుల్

న్యూఢిల్లీ,మే12(సాక్ష్యం): నీట్ ప్రశ్నాపత్రం లీక్ కారణంగా నీట్ పరీక్ష రద్దు కావడంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని లక్షల మంది కష్టాన్ని, కలల్ని బీజేపీ ప్రభుత్వం ఛిద్రం చేసిందని విమర్శిం చారు. ఇది కేవలం

మిగతా 2 లో..



# కొత్తగా 5 ఫైర్‌స్టేషన్ల ఏర్పాటు

### దశలవారిగా 1275 ఖాళీల భర్తీ

### పారిశ్రామిక ప్రాంతాల్లో ఇడస్ట్రీల భాగస్వామ్యం

### అధికారులతో సమీక్షలో హోంమంత్రి అనిత



కొత్తగా ప్రతిపాదించిన 5 ఫైర్‌స్టేషన్ల ఏర్పాటును వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత సూచించారు. విశాఖపట్నం పశ్చిమ పారిశ్రామిక ప్రాంతాల్లో ఇండస్ట్రీల భాగస్వామ్యంతో ఫైర్‌స్టేషన్లను ప్రతిపాదించినట్లు తెలిపారు. అగ్నిమాపక శాఖలో 1,275 ఖాళీలను దశల వారీగా భర్తీ చేయాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ పనితీరుపై అనిత సచివాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫైర్‌స్టేషన్లు లేని 22 నియోజకవర్గాల పరిస్థితిపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడారు. జాబ్ క్యాలెండర్‌లో ఉన్న 305 పోస్టుల నియామక ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఫైర్ సిబ్బంది స్పందన సమయాన్ని 30 నిమిషాల నుంచి 15 నిమిషాలకు తగ్గించాలని మార్గనిర్దేశం చేశారు. పరిశ్రమల సహకారంతో ఫైర్ అవుట్‌పోస్టుల ఏర్పాటును పరిశీలించాలని హోంమంత్రి అనిత సూచించారు. ఫైర్ టెండర్ల వినియోగంపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. సెజ్ ప్రాంతాల్లో సమష్టి స్టేషన్ల ఏర్పాటుపై దృష్టిసారించాలని పేర్కొన్నారు.

4 లో




# అసోం సీఎంగా హిమంత బిశ్వశర్మ

ప్రమాణ కార్యక్రమానికి ప్రధాని హాజరు

ఎన్డీయే ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు రాక

గౌహతి,మే12(సాక్ష్యం): అస్సాం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వశర్మ ప్రమాణ స్వీకారం చేశారు. అస్సాంలో వరుసగా రెండోసారి సీఎం పదవిని చేపట్టిన తొలి భాజపా నేతగా హిమంత నిలిచారు. ఆయనతో పాటు మరో నలుగురు మంత్రులు ప్రమాణం చేశారు.

మిగతా 5 లో..




### భగీరథకు సిట్ నోటీసులు

- నేడు విచారణకు రావాలని ఆదేశం
- హైకోర్టును ఆశ్రయించిన బండి భగీరథ్
- 14న విచారించనున్న వెకేషన్ బెంచ్
- చట్టానికి నా కొడుకు అతీతుడేమీ కాదు
- కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టీకరణ




హైదరాబాద్,మే12(సాక్ష్యం): కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం భగీరథ్‌కు నోటీసులు జారీ చేసింది. బుధవారం మధ్యాహ్నం

మిగతా 5 లో..

# వైన్స్ పై ఆంక్షలు

- తమిళ సీఎం విజయ్ సంచలన నిర్ణయం
- బడులు, గుడులు, బస్టాండ్ల వద్ద వైన్ షాప్‌ల ఎత్తివేత
- రెండువారాల్లోగా మూసేయాలంటూ ఆదేశాలు
- విజయ్ సోషల్ మీడియాకు పెరుగుతున్న ఆదరణ
- తమిళనాట బ్యానర్లు ఫ్లెక్సీలు బ్యాన్
- అభిమానులకు సీఎం విజయ్ ఆదేశం



చెన్నై,మే12(సాక్ష్యం): తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలు, దేవాలయాలు, బస్‌స్టాండ్స్‌కి 500 మీటర్ల దూరంలో ఉన్న 717 వైన్ షాపులన్నిం టినీ క్లోజ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ దుకాణాలను రెండు వారాల్లోగా మూసివేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత విజయ్ జారీ చేసిన తొలి ఉత్తర్వు ఇది. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలో టాస్మాక్ 4,765 మద్యం దుకాణాలను నిర్వహిస్తోంది. వీటిలో 276 మద్యం దుకాణాలు ప్రార్థనా స్థలాల సమీపంలో, 186 విద్యా సంస్థల సమీపంలో, 255 బస్ స్టాండ్‌ల సమీపంలో ఉన్నాయి. వీటిని వెంటనే

మిగతా 3 లో..

### తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా జేసీడీ ప్రభాకర్

డిప్యూటి స్పీకర్‌గా రవిశంకర్ ఎన్నిక

చెన్నై,మే12(సాక్ష్యం): తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా టీవీకే ఎమ్మెల్యే జేసీడీ ప్రభాకర్ మంగళవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీవీకేకు చెందిన మరో ఎమ్మెల్యే రవిశంకర్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక కోసం ఈ సమావేశం ఏర్పాటు

మిగతా 3 లో..

# జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడుత పంపిణీ

### రెండోవిడతపై 21న కేబినేట్‌లో ఖరారు చేస్తాం

### స్పెషల్ డ్రైవ్ ద్వారా డబుల్ ఇళ్లు పంపిణీ

### అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్,మే12(సాక్ష్యం): రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మిగతా 2 లో..



### ఆనాటి జైళ్లు దుర్భరంగా ఉండేవి

బ్రిటీష్ హయాంలో నరక కూపాలుగా జైళ్లు

తానూ ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లి వచ్చా

తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

చంచల్‌గూడాలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభం

హైదరాబాద్,మే12(సాక్ష్యం): స్వాతంత్ర్యానికి ముందు జైళ్లు ఎంత అమానవీయంగా ఉండేవో ప్రజలకు తెలియజేయాల్సి

మిగతా 5 లో..

# సంపాదకీయం

## ఖర్చులు తగ్గింపు...మోడీ నుంచే మొదలవ్వాలి !

మంచో చెడో...ప్రధాని మోడీ చేసిన ఓ సూచన ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇంకా మారాల్సి ఉంది. దీనిపై పైనుంచి కింది వరకు చర్చించాలి. అదేంటంటే ఖర్చులు తగ్గించాలి. బంగారం కొనగూడదు.. ఇంధనం తగ్గించుకుని వాహనాలను మూలన పెట్టాలి. లేదా తక్కువ మోతాదులో ఇంధనం వాడుకోవాలి. దేశహితం కోసం ఇది మంచిదే. అయితే ఎవరు ఖర్చులు తగ్గించాలన్నదే ముఖ్యం. దేశ అర్థిక వ్యవస్థ బలోపేతం కావడానికి ముందుగా ఖర్చుల జాబితాను రూపొందించి తగ్గించాలి. ప్రధాని మొదలు, ఎమ్మెల్యేల వరకు ఖర్చులు తగ్గించే ప్రయత్నం నేటినుంచే మొదలు పెడితే మంచిది. ఇందులో ప్రధానంగా రాజకీయ నాయకలు నుంచి తగ్గింపు మొదలైతే దేశం దరిద్రం పోతుంది. ముందుగా వారి జీతభత్యాల్లో కోత పెట్టాలి. వేలకోట్లు జీతభత్యాలు, విమాన ఖర్చులు, కార్లు, కాన్వాయ్‌ల ఖర్చులు వెంటనే కోత విధించాలి. ప్రధాని పిలుపు మేరకు దేశ ప్రజలు ఇంధన వినియోగం, బంగారం కొనుగోళ్లు, వంట నూనెల వినియోగం 10 శాతం తగ్గించుకుని, ఎరువుల దిగుమతులను 50శాతం మేర తగ్గించి, అనవసర విదేశీ పర్యటనలను మానుకుంటే.. ఏడాదిలో 4500 కోట్ల డాలర్ల మేర విదేశీ మారక ద్రవ్య నిల్వలను ఆదా చేయొచ్చని ఒక అంచనా. అంటే మన కరెన్సీలో దాదాపుగా రూ.4.3 లక్షల కోట్లు అన్న మాట. ఇది మంచి సలహా గనక ఎవరు తగ్గించుకోవాలన్న చర్చ మొదలు పెట్టాలి. అందుకే రాజకీయంగా అవుతున్న దుబారాను ముందుగా తగ్గించాలి. ఈ ఖర్చులు తగ్గితే విదేశీ మారకం నిల్వలు పెరుగుతాయి. దేశ జిడిపి పెరుగుతుంది. ప్రజలకు నిత్యావసర వస్తువులు సరసమైన ధరలకు దక్కుతాయి. రాజకీయ నాయకులు జీతభత్యాలు, కార్లు, విమానాలు, హెలికాప్టర్ల ఖర్చులు, అనవసరంగా విదేశీ టూర్లు, ఉచిత పథకాలు వంటివన్నింటిపైనా బ్యాన్ విధించాలి. ముందుగా ప్రధాని మోడీ టూర్లు తగ్గాలి. సిఎంల ప్రమాణాలకు సిఎంలను, కేంద్రమంత్రులను పిలవడం వల్ల ఎంత ఖర్చయ్యిందో లెక్కలు చెప్పాలి. అట్టహాసపు ప్రమాణ స్వీకారాల ఖర్చును దేశంపై రుద్దడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. చంద్రబాబు లాంటి వారు హెలికాప్టర్లు వేసుకుని పెన్షన్లు పంచడానికి వెళ్లడాన్ని నిషేధించాలి. అనవసర ఖర్చులతో రాష్ట్ర ఖజనాలను గుల్లచేసిన వారినుంచి ఆ మొత్తాలను రాబట్టాలి. ఇందుకోసం ఎంతటి కఠిన నిర్ణయమైనా తీసుకున్నా ఫర్వాలేదు. దేశ ఆర్థిక వ్యవస్థ బాగా ఉందంటే...అందుకు విదేశీ మారక నిల్వల మొత్తమే రుజువు. విదేశీ మారక ద్రవ్య నిల్వలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. ఒక దేశం ఎంత ధనికమైనది, ఎంత సురక్షితమైనది అని చెప్పడానికి ఈ ఫారెక్స్ రిజర్వులు కొలమానం లాంటివి. ఇవి తగ్గుతాయంటే మనం దిగుమతులను తగ్గించాలి. మన వ్యవసాయ ఉత్పత్తులను విదేశాలకు అమ్ముకోవాలి. ఇక్కడ రైతులు ధాన్యం కొనుగోళ్లు లేక దిగాలు పడుతున్నారు. అందువల్ల దేశీయంగా ఉత్పత్తి అయిన వస్తువులను వాడుదాం. అప్పుడు కూడా భారీగా ఖర్చులు తగ్గుతాయి. మోడీ ఇచ్చిన సలహాలను పాజిటివ్‌గా తీసుకుంటే మంచిదే. అయితే ఇది రాజకీయ నాయకులకు మాత్రమే హెచ్చరిక కావాలి. వారే తమ ఇంటి నుంచి సంస్కరణలు ప్రారంభించాలి. ఇకపోతే ప్రధాని మోడీ తన ప్రసంగంలో బంగారం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించడానికి కారణం ఏంటంటే.. భారతీయులు ఏడాదికి సగటున కొనే పసిడి దాదాపు 700-900 టన్నులని అంచనా! దీని విలువ సుమారు రూ.13.69 లక్షల కోట్లు. 2024-25తో పోలిస్తే.. 2025-26లో మన బంగారం దిగుమతులు దాదాపు 24శాతం పెరిగాయి. భారతీయులు కొనే బంగారంలో 90 శాతానికి పైగా విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నదే. అందుకు మనం భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఖర్చు చేయాల్సి వస్తోంది. కాబట్టి మోదీ చెప్పినట్లు ఏడాది పాటు బంగారం కొనకుండా ఉంటే కచ్చితంగా మన విదేశీ మారక ద్రవ్య నిల్వలపై భారం కాస్తంతైనా తగ్గుతుంది. ఇందులో ఉన్నత వర్గాల వారి కొనుగోళ్లే ఎక్కువని గుర్తించాలి. ఉన్నత వర్గాల వారు సైతం బంగారం కొనుగోళ్లు చేపట్టకుండా చూడాలి. బంగారం దిగుముతలపై ఆంక్షలు విధించాలి. దీంతో దేశీయంగా ఇళ్లల్లో మూలుగుతున్న బంగారన్ని బయటకు తీసి ఆదాయ వనరుగా మార్చాలి. ఇవన్నీ చేయగలుగుతామని చెప్పాలి. ఇకపోతే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలో బీజేపీ అధికార పగ్గాలు చేపట్టినప్పుడు, సామాన్యుడు తన కష్టాలన్నీ తీరిపోతాయని, భవిష్యత్తు బంగారం అవుతుందని కలలుగన్నాడు. కానీ కలలు కల్లలు అయ్యాయి. వస్తూత్పత్తి పెరిగింది. దాన్యం దిగుబడులు పెరిగాయి. కానీ ధరలు అమాంతంగా అంతకు రెట్టింపు అయ్యాయి. విద్యవైద్యం ఖరీదైన వస్తువుగా మారింది. అందుకే ప్రధాని మోడీ మాటలను సానుకూలంగా తీసుకుని నిజాన్ని మాట్లాడుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. అచ్చే దిన్ అన్న మోడీ మంచి రోజులు నిజంగా సామాన్యుడి ముంగిట నిలిచాయా అన్నది కూడా చర్చించాలి. కానీ నినాదాల హోరులో నిజాలు సమాధి అయ్యాయి. ప్రభుత్వ ప్రకటనలు చూస్తుంటే భారతదేశం వెలిగిపోతున్నట్లు కనిపిస్తున్నది. కానీ సామాన్యుల బతుకులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ప్రపంచంలోనే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ, డిజిటల్ ఇండియా విప్లవం, మేక్ ఇన్ ఇండియా అంటూ భారీ నినాదలు బయలుదేరాయి. కానీ రాజకీయ నాయకులు బలపడుతున్నారు. ప్రజలు బలహీన పడుతున్నారు. రాజకీయ నాయకులకు ఊడిగం చేసే దౌర్భాగ్యం పెరుగుతోంది. ఒక దేశంగా మనం ఎంత గర్వంగా తలెత్తుకుంటున్నామో, అదే స్థాయిలో అప్పుల భారంతో తల దించుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తున్నది. అందుకే ఖర్చులు తగ్గించుకోవడం అవసరమే. అది రాజకీయ నాయకలు నుంచి మొదలు కావాలి. మోడీ ఒక నిర్ణయం తీసుకుని పార్లమెంటులో చట్టం చేయాలి. రాజకీయ నాయకుల జీతభత్యాలు, పెన్షన్లు ఎత్తేయాలి. విదేశీ టూర్లు, విమాన ఖర్చులపై ఆంక్షలు విధించాలి. ఉచిత పథకాలను ఎత్తేయాలి. అప్పుడే దేశం బాగుపడుతుంది. మోడీ కోరుకున్న ఖర్చుల తగ్గింపు ఆలోచన కార్యరూపం దాలుస్తుంది.

# ధాన్యం సేకరణ సాఫీగా జరగాలి

హైదరాబాద్,మే12(సాక్ష్యం): ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ధాన్యం లోడ్ తరలిం చేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అం దుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దని.. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకు వెనకాడవద్దని ముఖ్యమంత్రి ఆదేశించారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగొద్దని తెలిపారు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని సూచించారు. మంగళవారం.. జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణపై జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని.. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటి కప్పుడు గోడౌన్స్‌కు తరలించాలని అన్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందే అని.. ప్రతి అధికారి జవాబుదారీ తనంతో వ్యవహరించాల్సిందే అని తేల్చిచెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకు ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు.

గోడౌన్స్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలుండాలని తెలిపారు. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్‌కు పోర్ట్ పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ధాన్యం లోడింగ్‌లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమామీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని రేవంత్ తెలిపారు.

ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని సూచించారు.




# జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడుత పంపిణీ

మొదటిపేజీ తరువాయి..

వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తామని చెప్పారు. మంగళవారం గృహనిర్మాణశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల విధివిధానాలను ఈనెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఖరారు చేస్తామని పొంగులేటి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం స్థలాలు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్దిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. హైదరాబాద్‌లో స్థలాలు ఉన్నవారికి ఈ నెలాఖరులోపు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో సీఎం రేవంత్ సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడతను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21 వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి మహ్మద్ అజారుద్దీన్, శాసన మండలిలో చీఫ్ విప్ మహేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదన్నారు. అటువంటి తప్పు పునరావృత్తం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకుని స్థలాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటి ప్రభుత్వం నగరానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో 2 బిహెచ్ కె ఇండ్లను నిర్మించి హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించడం వల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఇండ్లు తీసుకున్న లబ్దిదారులు అక్కడ నివసించడానికి సంసిద్ధతం వ్యక్తం చేయడం లేదని క్షేత్ర స్థాయి పరిశీలనల్లో స్పష్టమైందన్నారు. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఏ నియోజకవర్గానికి సంబంధించి ఆ నియోజకవర్గంలోనే ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్లు శిధిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ విషయంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యులను చేయాలని అధికారులను ఆదేశించారు. 2 బిహెచ్ కె ఇండ్లకు లబ్దిదారులను కేటాయించడానికి యుద్ధప్రాతిపదికన స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పూర్తి అయిన వాటికి, వివిధ నిర్మాణ దశల్లో ఉన్న వాటికి ఈ నెలాఖరు కల్లా లబ్దిదారులను గుర్తించాలని, అది కూడా ఆ కాలనీలకు అయిదు నుంచి ఎనిమిది కిలోమీటర్ల లోపు ఉన్న వారినే ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే నిర్మాణాలన్నీ పూర్తైన ఇండ్లలో లబ్దిదారులు ఉండేలా చూసేలా నిరంతరం పర్యవేక్షించా లన్నారు. ఈ కాలనీల్లో మంచినీరు, డ్రైనేజి, విద్యుత్ వంటి కనీస సౌకర్యాల కల్పనకు వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ పరిధిలో ఇండ్ల స్థలాలు ఉండి అర్హులైన లబ్దిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరక్టర్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని, పనితీరు మెరుగుపడాలని అన్నారు. పిడిలు తమ పరిధిలో గతంలో నిర్మించిన జెన్ఎన్ యుఆర్ఎం, రాజీవ్ గృహకల్ప, వాంబే హౌసింగ్ కాలనీలన్నిటిని సందర్శించాలని స్పష్టంగా నిర్దేశిరచారు. అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి పొంగులేటి హెచ్చరించారు.

## చెరువులు, సరస్సులు, వెట్‌ల్యాండ్స్ పరిరక్షణ

మొదటిపేజీ తరువాయి..

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వెట్‌ల్యాండ్స్ అథారిటీ కార్యకలాపాలు, వెట్‌ల్యాండ్స్ కాలుష్య నియంత్రణపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలోని చెరువులు, సరస్సుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సమగ్ర వివరాలు సమర్పించారు. ఈ సమావేశానికి అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్, ఫిషరీస్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలోని చెరువులు, సరస్సుల పునరుద్ధరణ, అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించారు. వెట్‌ల్యాండ్స్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. చెరువుల ఆక్రమణలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశర చేశారు. అక్రమ నిర్మాణాలు, కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రత్యేక చర్యలు అవసరమని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. పక్షులు, జలచరాలు, పర్యావరణ సమతుల్యతకు వెట్‌ల్యాండ్స్ కీలకమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో వెట్‌ల్యాండ్స్ పాత్ర అత్యంత ముఖ్యమని, వాటి సంరక్షణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వెట్‌ల్యాండ్స్ మ్యాపింగ్, మానిటరింగ్ పక్రియపై కూడా సమావేశంలో చర్చించారు. చెరువుల స్థితిగతులు, ఆక్రమణలు, కాలుష్య పరిస్థితులపై నిరంతర పర్యవేక్షించాలని అధికారులు అభిప్రాయపడ్డారు. చెరువుల పునరుద్ధరణకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భూగర్భ జలాల సంరక్షణలో కూడా వెట్‌ల్యాండ్స్ కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెట్‌ల్యాండ్స్ సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, జీవ వైవిధ్య పరిరక్షణలో కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.

## దేశంలో తగినన్ని ఇంధన నిల్వలు

మొదటిపేజీ తరువాయి..

సదస్సులో మంగళవారంనాడు ఆయన మాట్లాడుతూ, భారతదేశంలో ప్రస్తుతం 69 రోజులకు సరిపడా క్రూడాయిల్, ఎల్ఎన్జీ నిల్వలు, 45 రోజులకు సరిపడా ఎల్‌పీజీ నిల్వలు ఉన్నాయని తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో డిమాండ్‌కు అనుగుణంగా, నిరంతరాయ సరఫరాకు వీలుగా ప్రభుత్వం ఎల్‌పీజీ ఉత్పత్తిని రోజుకు 35,000-36,000



టన్నుల నుంచి 54,000 టన్నులకు పెంచిందని హర్దీప్ సింగ్ పురి చెప్పారు. ఎల్‌పీజీ సరఫరాలో ఎలాంటి సమస్యలు లేవన్నారు. సంక్షోభాన్ని బాధ్యతాయుతంగా ఎదుర్కొంటున్నామని, ఎక్కడా ఎలాంటి డ్రై-ఔట్లు లేవని చెప్పారు. ఇంధన సరఫరా గొలుసు స్థిరంగా ఉందని స్పష్టం చేశారు. పశ్చిమాసియా సంక్షోభం నుంచి ఆర్థిక ఒత్తిళ్లను తగ్గించేందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల తగిన సూచనలు చేసినట్టు కేంద్ర మంత్రి చెప్పారు. ప్రధానమంత్రి గత ఆదివారంనాడు హైదరాబాద్‌లో తెలంగాణ బీజేపీ నిర్వహించిన సదస్సులో దేశ ప్రజలకు పలు సూచనలు చేశారు. పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించుకోవాలని, సిటీల్లో మెట్రో రైల్ సేవలు, కార్‌పూలింగ్ సేవలను ఉపయోగించుకోవాలని, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని, పార్సిల్స్ కోసం రైల్వే సేవలు వినియోగించుకోవాలని, వర్క్ ఫ్రం హోంకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విదేశీ మారక ద్రవ్య నిల్వలను కాపాడుకునేందుకు ఏడాది పాటు బంగారం కొనుగోళ్లు, విదేశీ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని కోరారు.

## లక్షల మంది విద్యార్థుల కలలు కల్లలు

మొదటిపేజీ తరువాయి..

పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదని, యువత భవిష్యత్తును కాలరాసే నేరమని ఆరోపించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో రాహుల్ గాంధీ ఓ ట్వీట్ చేశారు. దేశవ్యాప్తంగా 22 లక్షల మందికి పైగా విద్యార్థుల కష్టం, తల్లిదండ్రుల త్యాగాలు, ఎన్నో కుటుంబాల ఆశలు ఈ అవినీతి పాలన వల్ల నాశనమయ్యాయని రాహుల్ గాంధీ అన్నారు. కొంతమంది తండ్రులు అప్పులు చేశారని, తల్లులు తమ నగలు అమ్మారని, లక్షలాది మంది విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివారని, అయితే పేపర్ లీకులు, ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా వ్యవస్థలో అవినీతి వారికి శాపంలా మారాయని విమర్శించారు. ప్రతిసారి పేపర్ మాఫియా తప్పించుకుంటోందని, నిజాయతీగా చదివిన విద్యార్థులే శిక్ష అనుభవిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్టం కాదు.. డబ్బు, పరిచయాలే భవిష్యత్తును నిర్ణయిస్తే విద్యకు అర్థమేంటి? ప్రధాని చెప్పే అమృత కాలం దేశ యువతకు విష కాలంగా మారింది' అని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని, పరీక్షల నిర్వహణలో కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు

## బిఆర్ఎస్ ముఖ్యనేతలతో కేసీఆర్ భేటీ

మొదటిపేజీ తరువాయి..

పార్టీ ఇన్‌ఛార్జ్‌ల నియామకం సహా పార్టీ బలోపేతం వంటి ముఖ్యమైన విషయాలపై కేసీఆర్ అధ్యక్షతన చర్చ జరిగినట్లు సమాచారం. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పార్టీ ప్రధాన కార్యదర్శులు, మండలి, శాసనసభా పక్షాల ఉపనాయకులు పాల్గొన్నారు. అలాగే అసెంబ్లీ డిప్యూటీ ఎ÷-లోర్ లీడర్లు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, శాసన మండలి ఫ్లోర్ లీడర్ సిరికొండ మధుసూదనాచారి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు ఎల్.రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఉన్న గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీల రద్దుపైనా సుదీర్ఘ చర్చ కొనసాగినట్లు తెలుస్తోంది. ఈ కమిటీల స్థానంలో కొత్త కమిటీలను ఎన్నుకోవాలని కేసీఆర్ ఆదేశించినట్లు సమాచారం. కమిటీల్లో పార్టీ కోసం కష్టపడి పని చేసే యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికలపైనా నేతలతో కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల తెలంగాణ పర్యటనపైనా కేసీఆర్ ఆరా తీస్తున్నట్లు సమాచారం. బండి సంజయ్ కుమారుడి కేసు వ్యవహారం కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ



అంశం గురించి కేసీఆర్‌కు బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ వివరించినట్లు సమాచారం. కొత్తగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపైనా బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ చర్చించారు. అలాగే ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై బలంగా పోరాటాలు చేయాలని నేతలను కేసీఆర్ ఆదేశించినట్లు తెలుస్తోంది. ప్రధానంగా పార్టీ బలోపేతం, కొత్త కమిటీల నియామకంపై దృష్టి సారించారు.

## ఎన్యూమరేటర్లకు కేటాయించిన ప్రతి ఇంటి సర్వే పూర్తి చేయాలి

### మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి

జమ్మికుంట, మే12 ( ప్రజాజ్యోతి ): ప్రభుత్వం ప్రతిష్టాత్మక తీసుకున్న జనాభా నమోదు ఎన్యూమరేటర్లకు కేటాయించిన ఏరియాలో ప్రతి ఇంటిని సర్వే చేయాలని మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి మంగళవారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా గణన 2026-27 జనాభా నమోదు కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల ఎన్యూమరేట్లు మీ ఇంటికి వచ్చి జనాభా గణన నమోదు చేస్తారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేటర్లు కేటాయించిన ఏరియాలో ప్రతి ఇంటికి వెళ్లి సెన్సెస్ వివరాలలో పొందుపర్చిన ప్రతి అంశాన్ని నింపి, ప్రజల సహకారంతో ఈ కార్యక్రమం పూర్తి చేస్తారన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఈ కార్యక్రమం పూర్తి చేస్తారని, ఈ సర్వే పూర్తి కావడానికి అన్ని వర్గాల ప్రజలు, ప్రజాప్రనిధులు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట టిపివో శ్రీధర్, టిపిబివో దీపిక, ఎన్యూమరేటర్లు పలువురు పాల్గొన్నారు.



## టీవీకే ఎమ్మెల్యేకు మద్రాస్ హైకోర్టు షాక్

**ఒక్కోటుతో గెల్చిన సేతుపతిని ఓటింగ్‌కు దూరం**
**విశ్వాస పరీక్షలో ఓటేయవద్దని హైకోర్టు ఆదేశం**

చెన్నై,మే12(సాక్ష్యం): తమిళనాడు నూతన ముఖ్యమంత్రి విజయ్ శాసనసభలో తన బలాన్ని నిరూపించుకునేందుకు సిద్ధమవుతున్న వేళ ఒక టీవీకే ఎమ్మెల్యేకు మద్రాస్ హైకోర్టు షాకిచ్చింది. ఈ ఎన్నికల్లో ఒక్క ఓటు తేడాతో నెగ్గిన ఆ ఎమ్మెల్యే.. సభలో సీఎం విజయ్ బలపరీక్షలో పాల్గొనవద్దని ఆదేశించింది. ఈ మేరకు న్యాయస్థానం మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. దాంతో విజయ్ బలపరీక్షలో టీవీకే కూటమి బలం 119 సీట్లకు పడిపోయినట్లయ్యింది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో శివగంగై జిల్లా తిరుప్పత్తూర్ నియోజకవర్గం నుంచి టీవీకే నేత శ్రీనివాస సేతుపతి విజయం సాధించారు. ఇక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెరియకరుప్పన్‌పై కేవలం ఒకే ఒక్క ఓటు తేడాతో సేతుపతి గెలుపొందారు. డీఎంకే నేత పెరియకరుప్పన్‌కు 83,374 ఓట్లు పోలవగా.. శ్రీనివాస సేతుపతి 83,375 ఓట్లతో విజయాన్ని సొంతం చేసుకున్నారు. అయితే ఈ ఫలితాలపై డీఎంకే నేత పెరియ కరుప్పన్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో పొరపాటు జరిగిందని తన పిటిషన్‌లో ఆరోపించారు. ఈవీఎం ఓట్ల లెక్కింపు ప్రక్రియలోనూ అవకతవకలు చోటుచేసుకున్నాయని, కాబట్టి తిరుప్పత్తూర్‌లో రీకౌంటింగ్ జరపాలని ఆయన న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అప్పటివరకు శ్రీనివాస సేతుపతి ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పెరియకరుప్పన్ పిటిషన్‌పై



విచారణ జరిపిన న్యాయస్థానం.. విజయ్ విశ్వాసపరీక్ష ఓటింగ్‌లో శ్రీనివాస సేతుపతి పాల్గొనవద్దని ఆర్డర్ వేసింది. మద్రాసు హైకోర్టు ఆదేశాలతో బలపరీక్షలో విజయ్‌కు ఒక ఓటు తగ్గినట్ల య్యింది. 234 శాసనసభ స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో విజయ్‌కి కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ కలుపుకుని ప్రస్తుతం 120 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. అందులో ఇప్పుడు ఒక ఎమ్మెల్యే బలపరీక్షలో పాల్గొనే అవకాశం లేకపోవడంతో విజయ్ బలం 119కి తగ్గిపోయింది. అయితే విజయ్ బల పరీక్షలో నెగ్గేందుకు మాత్రం ఎలాంటి అవాంతరం లేదు. విజయ్ బలపరీక్షలో నెగ్గడానికి 118 మంది ఎమ్మెల్యేల మద్దతు సరిపోతుంది. శ్రీనివాస సేతుపతికి బలపరీక్షలో ఓటువేసే అవకాశం లేకపోయినా.. 119 ఓట్లతో విజయ్ బలపరీక్షలో నెగ్గనున్నారు. నేడు అసెంబ్లీలో బలపరీక్షకు విజయ్ సిద్ధం అయ్యారు.

## నేషనల్ డెయిరీతో నార్ముల్ ఒప్పందం

హైదరాబాద్,మే12(సాక్ష్యం): నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్ (నార్ముల్), నేషనల్ డెయిరీ డెవలంప్‌మెంట్ బోర్డుతో త్రైపాక్షిక ఒప్పందం కుదర్చుకుంది. 15 ఏళ్లపాటు డెయిరీ అభివృద్ధి చేసే బాధ్యతను అది తీసుకోనుంది. ఒప్పందంలో భాగంగా మొదట పాడి రైతుల బకాయిలను చెల్లించేందుకు రూ.10 కోట్ల రూపాయలను చెల్లించనుంది. ఈ మేరకు ఎన్‌డిబిబి అధికారులతో తెలంగాణ రాష్ట్ర డెయిరీ విభాగం అధికారులు ఒప్పందాలు చేసుకున్నారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, పశుసంవర్ధక, డెయిరీ, ఫిషరీస్ సెక్రటరీ ఇలంబర్తి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఔఆఆః అధికారులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ప్రవేశాలు ప్రారంభం

**33 హాస్టళ్లకు ఔత్సాహిక విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానం**
**జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారిత అధికారి కేఎల్ హర్షిత**

విజయవాడ,మే12 :జిల్లాలోని 33 సాంఘిక సంక్షేమ బాలురు, బాలికల వసతి గృహాల్లో 2026-27 విద్యా సంవత్సరానికిగాను మూడో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థుల ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారిత అధికారి కేఎల్ హర్షిత మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. అదేవిధంగా ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, డిఎ÷-లొమా, ఫార్మసీ , మెడికల్, పీజీ, నర్సింగ్, పారామెడికల్ కోర్సులలో చదువుకొనే విద్యార్థులు పోస్టు మెట్రిక్ హాస్టళ్లలో ప్రవేశాలకు గాను ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రి మెట్రిక్‌కు సంబంధించి బాలురుకు 10, బాలికలకు 11 వసతి గృహాలు ఉన్నాయని, పోస్టు మెట్రిక్‌కు సంబంధించి బాలురుకు 6, బాలికలకు 6 వసతి గృహాలు ఉన్నట్లు తెలిపారు. విజయవాడ రెవెన్యూ



డివిజన్ పరిధిలో 9, నందిగామ పరిధిలో 13, తిరువూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 11 హాస్టళ్లు ఉన్నట్లు తెలిపారు. ప్రతి హాస్టల్ నందు 100 మందికి ప్రవేశం ఉంటుందని.. ఎస్సీలకు 70 శాతం, మిగిలిన వారికి 30 శాతం కేటాయించడం జరుగుతుందన్నారు. సాంఘిక సంక్షేమ గృహాలను ప్రభుత్వం ఆధునికీకరించిందని, ఆర్వో ప్లాంట్ల ద్వారా శుభ్రమైన తాగునీరు, మెనూ ప్రకారం పౌష్టికాహారం వంటివాటితో పాటు సీసీ కెమెరాలతో భద్రతా ఏర్పాట్లు ఉన్నాయన్నారు. కాస్మెటిక్స్ ఛార్జీలు, వివిధ రకాల వస్తువులు, క్రీడా సామగ్రి వంటివాటిని ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు ట్యూటర్లు కూడా అందుబాటులో ఉంటారన్నారు. విద్యార్థులు తమ గ్రామంలోని స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ద్వారా లేదా నేరుగా దగ్గర్లోని హాస్టల్ వార్డెన్ / సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి సమాచారానికి విజయవాడ, తిరువూరు, నందిగామ డివిజన్ల సహాయ సాంఘిక సంక్షేమశాఖ అధికారుల కార్యాలయాలు, మండలంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్ వా÷-డ్గ÷న్ కార్యాలయం, విజయవాడ పటమటలోని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయాన్ని సందర్శించ వచ్చున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల లోపు 87907 52259, 94925 83600 నంబర్లకు ఫోన్ చేసి కూడా సమాచారం పొందవచ్చని ఎస్సీ సంక్షేమం, సాధికారిత అధికారి కేఎల్ హర్షిత తెలిపారు.

# వైన్స్‌పై ఆంక్షలు

**మొదటిపేజీ తరువాయి..**

తొలగించాలని సీఎం ఆదేశించారు. కాగా మద్యం అమ్మకాల ద్వారానే రాష్ట్రానికి భారీగా ఆదాయం సమకూరుతోంది. అయినప్పటికీ.. ప్రజా సంక్షేమం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తమిళనాడు ప్రభుత్వం వెల్లడించింది. 2025 సంవత్సరంలో మద్యం అమ్మకాల ద్వారా రాష్ట్రానికి రూ.48,000 కోట్ల ఆదాయం వచ్చినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఇకపోతే తమిళనాట దళపతి విజయ్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వయసుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల్లో ఆయనను అభిమానించే వారు ఉన్నారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ ఏకంగా 108 స్థానాల్లో విజయం సాధించింది. రెండు రోజుల క్రితం విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీకి వెళ్లారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే తమిళనాడు సీఎంఓ ఆఫీస్ సోషల్ మీడియా ఖాతాల డీపీలు మారాయి. ముఖ్యమంత్రి విజయ్ ఫొటోలను డీపీలుగా పెట్టారు. విజయ్ ఫొటో డీపీగా పెట్టిన గంటల్లోనే మ్యాజిక్ జరిగింది. సోషల్ మీడియా ఖాతాలకు ఫాలోవర్స్ క్యూ కట్టారు. తమిళనాడు సీఎంఓ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు మొదట 4 లక్షల ఫాలోవర్స్ ఉండేవారు. విజయ్ ఫొటో పెట్టిన తర్వాత 16 లక్షలకు ఫాలోవర్స్ సంఖ్య పెరిగింది. ఇక ఎక్స్ ఖాతాకు కూడా 4 లక్షల మంది ఫాలోవర్స్ ఉండేవారు. ఇప్పుడు 22 లక్షల మంది అయ్యారు. అందుకే ఆయన తీసుకునే నిర్ణయాలకు ప్రజలు జై కొడుతున్నారు.
ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పార్టీని స్థాపించామని తెలిపిన టీవీకే, ప్రజలు ఇబ్బంది పడే పనులకు దూరంగా ఉండాలని స్పష్టం చేసింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి ఎన్. ఆనంద్ ఒక అధికారిక ప్రకటనను విడుదల చేశారు. నాయకుల పుట్టినరోజులు లేదా కుటుంబ వేడుకల సందర్భాల్లో వీధులు, బహిరంగ ప్రదేశాలు, జనసమూహం ఉన్న చోట లేదా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ఎలాంటి బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని పార్టీ కార్యకర్తలను ఆదేశించింది. అంతేగాకుండా.. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఎలాంటి



వేడుకలు జరపకూడదని, ఒకవేళ పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి విజయ్ నిర్ణయించినట్లు పార్టీ ప్రకటించింది. ప్రజలు మనపై ఎంతో నమ్మకం ఉంచారని, ఆ నమ్మకాన్ని కాపాడుకుంటూ బాధ్యతాయుతంగా నడుచుకోవాలని కార్యకర్తలకు సూచించింది. తమిళనాడు అభివృద్ధి కోసం పయనిస్తున్న తరుణంలో, ప్రజా ప్రయోజనాలకు భంగం కలిగించే చర్యలను ఏమాత్రం సహించబోమని ఈ ప్రకటన ద్వారా టీవీకే గట్టి హెచ్చరిక జారీ చేసింది.

## జగన్‌వి నీతి మాలిన రాజకీయాలు

**అభివృద్ధి అంటే గిట్టని వైసిపి నేత**
**అమరావతిని చూసి ఓర్వలేక మావిగన్ జపం**
**జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి కొల్లు రవీంద్ర**

మచిలీపట్నం,మే12: మూడు రాజధానుల వ్యవహారం ముగిసినా..ఇప్పుడు మావిగన్ పేరుతో జగన్ విన్యాసాలు చేస్తున్నారని, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే చూసి ఓర్వలేక జగన్ రెడ్డి విషం చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు. మంగళవారం మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డి లాంటి దుర్మార్గుడి చూపు రాష్ట్రంపై పడకూడదని నాడు ఆయన తండ్రే తరిమేశారని ఆరోపించారు. ప్రజావేదిక కూల్చివేతతో జగన్ రెడ్డి రాష్ట్రంపై తన దుర్మార్గాలకు శ్రీకారం చుట్టారని దుయ్యబట్టారు. మూడు రాజధానుల పేరుతో అధికారంలో ఉన్న ఐదేళ్లు అరాచకం సృష్టించారని మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహించారు. భూములిచ్చిన రైతన్నలను పోలీసుల లాఠీలతో కొట్టించి, బూటు కాళ్లతో తన్నించారని విమర్శించారు. పేదల బియ్యాన్ని పందికొక్కులా బొక్కేసినోళ్లు కూడా నీతులు మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. జగన్ తన



తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని క్విడ్ ప్రో కో ద్వారా ప్రజల ఆస్తులను దోచారని మండిపడ్డారు. ఐదేళ్లు అడ్డగోలుగా దోచుకుని అమరావతి నిర్మాణంపై నిందలేయడం సిగ్గుచేటని అన్నారు. మావిగన్ అంటూ ఇప్పుడు మాట్లాడే వైసీపీ నేతలు.. గత ఐదేళ్లు ఏం చేశారు..? అని ప్రశ్నించారు. జగన్ రెడ్డికి భజన చేయడం తప్ప వైసీపీ నేతలు సొంత బుర్రలు వాడటం మానేశారని సెటైర్లు గుప్పించారు.
అమరావతే రాజధాని అని ఒకసారి.. మూడు రాజధానులని మరోసారి.. ఇప్పుడు మావిగన్ అంటూ నీతి లేని వ్యాఖ్యలు చేస్తున్నారని కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. కృష్ణా గుంటూరు జిల్లాల్లోని వైసీపీ నేతలు జగన్ రెడ్డికి భజన చేయడం తప్ప రాష్ట్రాభివృద్ధి పట్టదా..? అని నిలదీశారు. మూడు ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. రాయలసీమకు గతంలో కియా, ఇప్పుడు డ్రోన్స్, డిఫెన్స్, రాయల్ ఎన్ ఫీల్డ్ తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఉత్తరాంధ్రలో భోగాపురం, గూగుల్ డేటా సెంటర్, అర్సెలార్ మిట్టల్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పుడు నీతులు మాట్లాడుతున్న బియ్యం దొంగ ఐదేళ్లలో బందరు పోర్టు ఎందుకు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పేర్ని నాని తన స్థాయి మరిచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురించి మాట్లాడుతున్నారని కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కవితకు రైల్వే కోర్టు సమన్సు

**కామారెడ్డిలో రైల్‌రోకో కేసు..**
**నేడు సికింద్రాబాద్ కోర్టుకు హాజరు కావాలని ఆదేశం**

హైదరాబాద్,మే12(సాక్ష్యం): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల డిమాండ్ చేస్తూ నిర్వహించిన రైల్ రోకో కార్యక్రమం కేసులో తెలంగాణ రక్షణ సేన(టీఆర్‌ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు సమన్లు జారీ అయ్యాయి. బుధవారం విచారణకు హాజరు కావాలని సికింద్రాబాద్ రైల్వే కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కొంతకాలం క్రితం కామారెడ్డి జిల్లా కేంద్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కవిత ఆధ్వర్యంలో రైల్ రోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే రవాణాకు అంతరాయం కలిగిందని రైల్వే ఏఎస్ఐ రవీంద్రబాబు ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. రైల్ రోకోతో నిజామాబాద్-హైదరాబాద్ రూట్‌లో అంతరాయం ఏర్పడింది. నేటి ఉదయం 10:30కి విచారణకు హాజరు కావాలని సికింద్రాబాద్ రైల్వే కోర్టు ఆదేశించింది. దేవగిరి ఎక్స్‌ప్రెస్‌తో పాటు గూడ్స్ రైలు నిలిపివేతపై రైల్వే యాక్ట్ సెక్షన్ల కింద కవితపై న్యాయస్థానం కేసు నమోదు చేసింది. ఈ కేసులో కవితతో పాటు మరో 12 మంది బీఆర్‌ఎస్ నాయకులపై కూడా కేసులు నమోదయ్యాయి. రైల్వేచట్టాల ఉల్లంఘన, ప్రజా రవాణాకు ఆటంకం కలిగించడం వంటి ఆరోపణలపై కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఈ కేసు విచారణలో భాగంగా నేడు సికింద్రాబాద్ రైల్వే కోర్టుకు కవిత, బీఆర్‌ఎస్ నేతలు హాజరవుతారా లేదా అనేది ఉత్కంఠగా మారింది. బీసీ రిజర్వేషన్ల అంశం తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా మారిన నేపథ్యంలో ఈ కేసు ప్రాధాన్యం సంతరించుకుంది.



## తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా జేసీడీ ప్రభాకర్

**మొదటిపేజీ తరువాయి..**

చేసినట్టు ప్రోటెం స్పీకర్ ఎంవీ కరప్పయ్య తెలిపారు. తొలుత ప్రభాకర్ నామినేషన్‌ను ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ప్రతిపాదించారు. ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా స్పీకర్ ఎన్నిక జరిగింది. అనంతరం ప్రోటెం స్పీకర్‌గా తన పాత్ర ముగిసినట్టు కరప్పయ్య ప్రకటించారు.



ఆ వెంటనే సభాసాంప్రదాయం ప్రకారం స్పీకర్ ప్రభాకర్‌ను ఆయన చైర్ వరకూ సభానేత కేఏ సెంగోట్టియన్, ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ తోడ్కొని వెళ్లారు. ఆయనకు అభినందనలు తెలిపారు. స్పీకర్‌గా ప్రభాకర్ బాధ్యతలు చేపట్టిన వెంటనే డిప్యూటీ స్పీకర్ ఎన్నికను చేపట్టారు. డిప్యూటీ స్పీకర్ పదవికి తురైయూర్ టీవీకే ఎమ్మెల్యే ఎం.రవిశంకర్ ఒక్కరే నామినేషన్ వేశారని, దీంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైందని ప్రభాకర్ ప్రకటించారు. రవిశంకర్ నామినేషన్‌ను సెంగోట్టియన్ ప్రతిపాదించారు.

## సనత్‌నగర్ టిమ్స్‌లో వైద్య సేవల ట్రయల్ రన్

హైదరాబాద్,మే12(సాక్ష్యం): సనత్‌నగర్ టిమ్స్‌లో జరుగుతున్న వైద్య సేవల ట్రయల్ రన్‌ను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు.హాస్పిటల్ బ్లాకులన్నీ మంత్రి కలియ తిరిగారు. ఓపీ రిజిస్ట్రేషన్, ఐపీ వార్డులు, ఎమర్జెన్సీ డిపార్ట్ మెంట్, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ల్యాబులు, మెకనైజ్డ్ ల్యాండ్రీ, కిచెన్ తదితర అన్ని డిపార్ట్‌మెంట్లను మంత్రి పరిశీలించారు. పెండింగ్ పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి సూచించారు. హాస్పిటల్‌కు నీళ్లు, పవర్ సప్లైలో ఎలాంటి ఆటంకం ఉండకూడదని, 24 గంటల సరఫరా ఉండాలని మంత్రి సూచించారు. ఫైర్ సేఫ్టీ విషయంలో రాజీ ఉండకూడదని, అన్ని ఫ్లోర్లలో మరోసారి పూర్తిస్థాయి పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. రిసెప్షన్ ఏరియా, హెల్ప్ డెస్క్, ఓపీ కౌంటర్లు, వెయిటింగ్ హాల్, ఓపీ కన్సల్టేషన్ రూమ్స్, డయాగ్నస్టిక్స్, ఇన్ పేషెంట్ వార్డులు, ఫార్మసీ తదితర ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి.. రిజిస్ట్రేషన్ కౌంటర్స్, ఫార్మసీ కౌంటర్స్ పెంచాలని మంత్రి సూచించారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్ రే, ఆల్ట్రాసౌండ్ తదితర యంత్రాలను పరిశీలించిన మంత్రి.. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ యంత్రాలు పూర్తిస్థాయిలో పేషెంట్లకు ఉపయోగపడాలని, ఇందుకు అవసరమైన డాక్టర్లు, ఇతర సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రారంభం నాటికి అన్ని సౌకర్యాలతో హాస్పిటల్‌ను సిద్ధం చేయాలని, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. జూన్ లో సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభిస్తామని అన్నారు. ఇక్కడ సక్సెస్‌ఫుల్‌గా వైద్య సేవల ట్రయల్ రన్ జరుగుతోంది.కొన్ని ఫినిషింగ్ వర్క్స్ జరుగుతున్నాయి. ఆ పనులన్నీ గడువులోగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించామన్నారు. ఇది వెయ్యి బెడ్ల హాస్పిటల్, ఇందులో 300 ఎమర్జెన్సీ బెడ్లు ఉంటాయి. అత్యవసర పరిస్థితుల్లో బాధితుల ప్రాణాలు నిలిపే గొప్ప హాస్పిటల్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నాం. గుండె సంబంధిత వ్యాధుల చికిత్సలు, ఆర్గాన్ ట్రాన్స్‌ప÷-లాంటేషన్ సర్జరీలకు ఈ హాస్పిటల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఉంటుందని వివరించారు. ఇక్కడే అద్భుతమైన రీసెర్చ్ సెంటర్ అందుబాటులోకి తీసుకొస్తాం అని దామోదర అన్నారు.

Altum Credo Home Finance

**ఆల్టమ్ క్రెడో హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లి.**
రిజిష్టర్డ్ కార్యాలయం: ఫ్లోర్ నం.7, కల్పతరు ఇన్ఫినియా, వాక్డేవాడి, శివాజీనగర్, పూణె-411005 మహారాష్ట్ర (ఇండియా).

**డిమాండ్ నోటీస్**

సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3(1) తో చదవబడిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ 2002 లోని సెక్షన్ 13(2) కింద. దిగువ సంతకందారు ఆల్టమ్ క్రెడో హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ACHFL) యొక్క అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ 2002 (చెప్పబడిన చట్టం) కింద. 2002 సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్‌లోని రూల్ 3(1) తో చదవబడిన ఈ చట్టంలోని సెక్షన్ 13(2) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ, ఈ చట్టంలోని 13(2) కింద అధీకృత అధికారి డిమాండ్ నోటీసులు జారీ చేశారు, రుణగ్రహీత(లు) ["చెప్పబడిన రుణగ్రహీత(లు)"], వారికి జారీ చేయబడిన సంబంధిత డిమాండ్ నోటీసు(లు)లో పేర్కొన్న మొత్తాలను తిరిగి చెల్లించమని కోరడం జరిగింది. పైన పేర్కొన్న వాటికి సంబంధించి, ఈ నోటీసు ప్రచురించబడిన అరవై రోజులలోపు, క్రింద సూచించబడిన మొత్తాలను, పైన పేర్కొన్న డిమాండ్ నోటీసు(లు)లో వివరించిన విధంగా వడ్డీతో కలిపి, క్రింద పేర్కొన్న తేదీ(లు) నుండి చెల్లింపు మరియు/లేదా రియలైజ్ చేయబడిన తేదీ వరకు, రుణగ్రహీత అమలు చేసిన రుణ ఒప్పందం ప్రకారం చెల్లించాల్సిన ఇతర పత్రాలు/ వ్రాతపూర్వకంగా సహా, ఏదైనా ఉంటే, రుణగ్రహీత చెల్లించమని మరోసారి నోటీసు ఇవ్వబడింది. రుణం తిరిగి చెల్లించడానికి సెక్యూరిటీగా, ఈ క్రింది ఆస్తులను రుణగ్రహీతలు ఆల్టమ్ క్రెడో హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ACHFL)కి తనఖా పెట్టారు.

| రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు) మరియు గ్యారంటర్(లు) లోన్ అకౌంట్ నంబర్ |
| --- |
| 1. పొట్లూరి అనిత (దరఖాస్తుదారు), 2. దేవరకొండ మహీంద్ర (సహ-దరఖాస్తుదారు), LAN: S160202000244 |
| **డిమాండ్ నోటీసు తేదీ మరియు అమౌంట్, ఎన్‌పిఏ తేదీతో** |
| 17-04-2026/రూ. 7,87,066 (రూపాయలు ఏడు లక్షల ఎనభై ఏడు వేల అరవై ఆరు మాత్రమే) 13-04-2026 నాటికి (ఎన్‌పిఏ) 10-04-2026 |
| **సెక్యూర్డ్ అసెట్స్ వివరణ (స్థిరాస్తి)** |
| పెదపుతేడు @పడ్డీసన్‌పేట్ గ్రామం, దగదర్తి తాలూకా, నెల్లూరు జిల్లా పరిధిలో, బుచ్చిరెడ్డిపాలెం ఉప-రిజిస్ట్రేషన్ జిల్లా పరిధి, హౌస్ నెం./అసెస్‌మెంట్ నెం. 817, సర్వే నెం. 756-1, బ్లాక్ నెం. 4 లోని 144 చదరపు గజాల విస్తీర్ణముతో, ఆర్‌సీసీ నిర్మాణం 360 చదరపు అడుగులు కలిగిన ఆస్తి, సరిహద్దులు: తూర్పు : రాజా వీధి (స్ట్రీట్), పడమర : కట్ట రాజు వారి ఇంటి స్థలం దక్షిణం : దేవరకొండ కళ్యాణి వారి ఇంటి స్థలం, ఉత్తరం : రాజా వీధి (స్ట్రీట్) |
| **రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు) మరియు గ్యారంటర్(లు) లోన్ అకౌంట్ నంబర్** |
| 1. ఉండ్రసపు సుశీల (దరఖాస్తుదారు), 2. ఉండ్రసపు బుజ్జిబాబు (సహ-దరఖాస్తుదారు) LAN: S168202000301 |
| **డిమాండ్ నోటీసు తేదీ మరియు అమౌంట్, ఎన్‌పిఏ తేదీతో** |
| 17-04-2026 / రూ. 8,08,628/- (రూపాయలు ఎనిమిది లక్షల ఎనిమిది వేల ఆరు వందల ఇరవై ఎనిమిది మాత్రమే) 13-04-2026 నాటికి (ఎన్‌పిఏ) 10-04-2026 |
| **సెక్యూర్డ్ అసెట్స్ వివరణ (స్థిరాస్తి)** |
| తాళ్లపాలెం గ్రామం మరియు పంచాయతీ, కాశింకోట మండలం, అనకాపల్లి, అనకాపల్లి ఉప-రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో 72 చదరపు గజాల విస్తీర్ణముతో, డి నెం. 2-27, అసెస్‌మెంట్ నెం. 1085, గ్రామకంఠం సర్వే నెంబర్లు (117 మరియు ఎల్.పి. నెం. 2230), గ్రౌండ్ ఫ్లోర్ ఆర్‌సీసీ నిర్మాణం 362 చదరపు అడుగుల ఆస్తి. **సరిహద్దులు: తూర్పు** : పంచాయతీ సి.సి. రోడ్డు **పడమర** : ఇతరుల స్థలం **దక్షిణం** : కె. నానాజీ వారి ఇల్లు **ఉత్తరం** : ఇతరుల పునాది స్థలం |

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్
తేది: 13.05.2026
సం/-
అధీకృత అధికారి
ఆల్టమ్ క్రెడో హోమ్ ఫైనాన్స్ ప్రై. లి. (ACHFL)

## ఎపిలో స్థానిక ఎన్నికల నిర్వహణ

**అధికారులతో సమీక్షించిన ఎన్నికల కమిషనర్**

అమరావతి,మే12: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ మంగళవారం కీలక సమావేశం నిర్వహించింది. స్టేట్ ఎలక్షన్ కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎన్నికల సన్నాహకాలు, ప్రీ-ఎలక్షన్ కార్యకలాపాల పురోగతిపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి పంచాయతీరాజ్, మున్సిపల్, బీసీ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. గ్రామ పంచాయతీలు, అర్బన్ లోకల్ బాడీస్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై అధికారులు వివరాలు సమర్పించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందుగా చేపట్టాల్సిన కార్యక్రమాల పురోగతిని ఎస్ఈసీ సమీక్షించారు. ఓటరు జాబితాల సవరణ, రిజర్వేషన్ల ఖరారు, వార్డుల విభజన, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు వంటి అంశాలపై చర్చించారు. ఎన్నికల నిర్వహణను పారదర్శకంగా, సమర్థవంతంగా చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళికపై ఈ సమావేశంలో చర్చించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. ప్రీ-ఎలక్షన్ పనులను వేగవంతం చేయాలని స్టేట్ ఎలక్షన్ కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఆలస్యం లేకుండా అన్ని ఏర్పాట్లు గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ఇప్పటికే రాజకీయ పార్టీల్లో చర్చ మొదలైంది. గ్రామ పంచాయతీలు, మున్సిపల్ సంస్థల ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారనున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ సన్నాహకాలను వేగవంతం చేస్తోంది.

## 24 గంటల్లోనే వాహన రిజిస్ట్రేషన్

రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

అమరావతి,మే12: ఏపీలో కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై 24 గంటల్లోనే కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ పూర్తి చేయనున్నట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ కొత్త విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. వాహనదారులకు వేగవంతమైన సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. డీలర్ టెంపరరీ రిజిస్ట్రేషన్ అనంతరం 24 గంటల్లోనే రిజిస్ట్రేషన్ కు ఆమోదం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఫ్యాన్సీ నంబర్ వాహనాలకు మాత్రమే మినహాయింపు ఉంటుందని మంత్రి తెలిపారు. గడువులోపు సంబంధిత అధికారులు స్పందించకపోతే ఆటోమేటిక్‌గా రిజిస్ట్రేషన్ ఆమోదం అయినట్లు పరిగణించనున్నట్లు తెలిపారు. సెలవు రోజుల్లో కూడా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్‌ను ఆమోదిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లకు చెక్ పెట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు పారదర్శకంగా, సులభంగా సేవలు అందించడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఈ కొత్త విధానం అమలు చేయనున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రకటించారు.

## బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం

**మరింత బలపడే అవకాశం ఉందన్న వాతావరణశాఖ**

విశాఖపట్టణం,మే12: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోంది. రానున్న 48 గంటల్లో ఇది మరింత బలపడే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. కోస్తా జిల్లాల్లో వచ్చే ఐదు రోజుల పాటు వానలు పడే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. రాయలసీమ నుంచి తమిళనాడు, కర్ణాటక వరకు ద్రోణి విస్తరించి ఉందని అధికారులు చెప్పారు. మరోవైపు నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఈరోజు ఉదయం 8:30 గంటల సమయానికి అదే ప్రాంతంలో కొనసాగుతోందని ఐఎండీ తెలిపింది. ఇది సముద్ర మట్టానికి సగటున 4.5 కిలోమీటర్ల ఎత్తు వరకూ విస్తరించి ఉందని వెల్లడించింది. ఇది రాబోయే 48 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది. నైరుతి ప్రాంతం కాకుండా మిగిలిన బంగాళాఖాతం, అండమాన్ సముద్రంలో వాతావరణం సాధారణంగా ఉంటుందని చెప్పింది. ఈ వారం చివరి నాటికి దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండమాన్ అండ్ నికోబార్ దీవుల్లోని కొన్ని ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాల ప్రవేశానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని ఐఎండీ తెలిపింది. ఈ మేరకు ఓ ప్రకటన జారీ చేసింది.

## ప్రతిభ చాటుతున్న బీసీ సంక్షేమ స్కూళ్ల విద్యార్థులు

**టెన్త్‌లో ర్యాంకులు సాధించిన వారికి మంత్రి అభినందనలు**
**400 మంది విద్యార్థులకు పురస్కారాలు, మెమొంటోలు**

విజయవాడ,మే12: టెన్త్ క్లాస్‌లో మంచి మార్కులు సాధించిన గురుకుల విద్యార్థులను మంత్రి సవిత సత్కరించారు. దాదాపు 400 మంది విద్యార్థులకు పురస్కారాలు, మెమెంటోలను అందజేశారు. టెన్త్ క్లాస్‌లో ఎంజేపీ గురుకుల పాఠశాల విద్యార్థిని, నంద్యాలకు చెందిన సాయి శ్రీ 596 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రం అంతా బీసీ సంక్షేమ స్కూల్స్‌వైపే చూడ్డానికి కారణం ప్రిన్సిపాల్స్, సెక్రటరీస్, డైరెక్టర్లు అని అన్నారు. బీసీ సంక్షేమ స్కూళ్లలో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులు నిరూపించారన్నారు. వేదిక మీద చాలామంది గవర్నమెంట్ స్కూళ్లలో చదువుకున్నవారే ఉన్నారన్నారు. 'తల్లిదండ్రులు మమ్మల్ని నమ్మి.. మీ బిడ్డలను బీసీ సంక్షేమ స్కూల్స్‌కు పంపించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు' అని మంత్రి అన్నారు. తల్లిదండ్రులు కోరుకున్న విధంగానే విద్యార్థులకు మంచి మార్కులు వచ్చాయని తెలిపారు. రోజుకి 20 గంటలు పేద ప్రజల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని మంత్రి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ సంక్షేమ స్కూల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. అధికారంలోకి రాగానే డైట్ బిల్లు రూ.110 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మస్కిటో మెష్, ఇన్వెర్టర్స్, ఆర్వో ఎ÷-లాంట్స్, సన్న బియ్యం, 100 డేస్ యాక్షన్ ఎ÷-లాన్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇంట్లో ఎంతమంది బిడ్డలు ఉంటే అంతమందికి 'తల్లికి వందనం' అందిస్తున్నామన్నారు. విద్యతో పాటు స్పోర్ట్స్ డెవలప్ చేసే దిశగా కృషి చేస్తున్నామని మంత్రి చెప్పారు. 1500 టాయిలెట్స్ బీసీ స్కూళ్లలో రెడీ అవుతున్నాయని అన్నారు. భావితరాల భవిష్యత్తు కోసం మంచి రాజధాని నిర్మిస్తున్నామని తెలిపారు. ఎంజేపీ గురుకులాల్లో ప్రస్తుతం స్కూల్స్ మాత్రమే ఉన్నాయని.. 6 కాలేజీల ఏర్పాటుకు అనుమతి వచ్చిందని మంత్రి అన్నారు. బీసీ సంక్షేమ స్కూళ్లలో చదివే విద్యార్థులకు ఇంటర్నేషనల్ అవార్డ్స్ కూడా వచ్చాయన్నారు. బీసీ సంక్షేమ స్కూళ్లలో ఒక హాస్టల్ విద్యార్థికి 75 వేల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేస్తోందని మంత్రి సవిత పేర్కొన్నారు.

# కొత్తగా 5 ఫైర్‌స్టేషన్ల ఏర్పాటు

**దశలవారిగా 1275 ఖాళీల భర్తీ**
**పారిశ్రామిక ప్రాంతాల్లో ఇడస్ట్రీల భాగస్వామ్యం**
**అధికారులతో సమీక్షలో హోంమంత్రి అనిత**

అమరావతి,మే12: కొత్తగా ప్రతిపాదించిన 5 ఫైర్‌స్టేషన్ల ఏర్పాటును వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత సూచించారు. విశాఖపట్నం పశ్చిమ పారిశ్రామిక ప్రాంతాల్లో ఇండస్ట్రీల భాగస్వామ్యంతో ఫైర్‌స్టేషన్లను ప్రతిపాదించినట్లు తెలిపారు. అగ్నిమాపక శాఖలో 1,275 ఖాళీలను దశలవారీగా భర్తీ చేయాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ పనితీరుపై అనిత సచివాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫైర్‌స్టేషన్లు లేని 22 నియోజకవర్గాల పరిస్థితిపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడారు.
జాబ్ క్యాలెండర్‌లో ఉన్న 305 పోస్టుల నియామక ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఫైర్ సిబ్బంది స్పందన సమయాన్ని 30 నిమిషాల నుంచి 15 నిమిషాలకు తగ్గించాలని మార్గనిర్దేశం చేశారు. పరిశ్రమల సహకారంతో ఫైర్ అవుట్‌పోస్టుల ఏర్పాటును పరిశీలించాలని హోంమంత్రి అనిత సూచించారు. ఫైర్ టెండర్ల వినియోగంపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. సెజ్ ప్రాంతాల్లో సమష్టి స్టేషన్ల ఏర్పాటుపై దృష్టిసారించాలని పేర్కొన్నారు. పరిశ్రమల్లో ఫైర్‌సేఫ్టీ అధికారుల నియామకం తప్పనిసరిగా చేయాలని స్పష్టం చేశారు. లైసెన్స్ పొడిగింపులకు ÷ర్‌సేఫ్టీ సర్టిఫికెట్లు తప్పనిసరి చేయాలని సూచించారు. అడవిలో అగ్నిప్రమాదాల నియంత్రణలో డ్రోన్ల వినియోగంపై దృష్టిసారించాలని ఆదేశించారు. వ్యర్థాలపై సరైన వర్గీకరణ లేకపోవడంతో అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు, ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్లలో ÷ర్‌సేఫ్టీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని దిశానిర్దేశర చేశారు. 'ఆపద మిత్ర' తరహాలో యువతకు స్వచ్ఛంద సేవా శిక్షణను విస్తరించాలని సూచించారు. సింగపూర్, స్విట్జర్లాండ్ విపత్తు నిర్వహణ విధానాలపై అధ్యయనం చేయాలని మార్గనిర్దేశర చేశారు. ఛత్తీస్‌గఢ్, చండీగఢ్ నమూనాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని సూచించారు. అగ్నిమాపక అత్యవసర సేవలను 112 సేవలతో సమన్వయం చేయాలని హోంమంత్రి అనిత ఆదేశాలు జారీ చేశారు.



# రోగుల ప్రాణాలను కాపాడే యోధులు... నర్సులు

**సేవలో మానవత్వం... నర్సింగ్ వృత్తి గొప్పతనం**
**సంతృప్తికర వైద్య సేవల్లో నర్సుల పాత్ర కీలకం**
**వనరుల సద్వినియోగంతో ప్రైవేటుగా దీటుగా జీజీహెచ్ సేవలు**
**త్వరలో అన్ని సమస్యలకూ పరిష్కారం**
**ఎంపీ కేశినేని శివనాథ్**

విజయవాడ,మే12: రోగుల ప్రాణాలను కాపాడటంలో నర్సుల పాత్ర అత్యంత కీలకమని.. వైద్యులతో సమానంగా నర్సులు కూడా అహర్నిశలు కష్టపడుతూ రోగులకు ధైర్యం, భరోసా కల్పిస్తూ చక్కని చిరునవ్వుతో ఆత్మీయతతో రోగాన్ని దూరం చేస్తున్నారని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా మంగళవారం విజయవాడలోని న్యూ జీజీహెచ్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యులు గద్దె రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. వైద్యరంగంలో కీలకమైన నర్సు వృత్తికి గౌరవాన్ని, హుందాతనాన్ని తీసుకొచ్చిన ఎ÷-లోరెన్స్ నైటింగేల్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ప్రజల ఆరోగ్యరక్షణలో నర్సులు అందించిన తోడ్పాటును ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. రిటైర్డ్ నర్సింగ్ సూపరింటెండెంట్ జి.అక్కమ్మ రూ. 50 వేలు అందించగా.. మరో లక్షా యాభైవేలు నర్సింగ్ అసోసియేషన్ ద్వారా సమకూర్చి ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ÷ూర్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న వనరులు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూనే జీజీహెచ్ ద్వారా అందించే వైద్య సేవల్లో 80 శాతానికి పైగా సంతృప్తి స్థాయి నమోదుకావడంలో నర్సుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఆసుపత్రితో పాటు నర్సింగ్ కళాశాల, వసతి గృహానికి సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని.. త్వరలోనే ఇవి పరిష్కారమవుతాయన్నారు. ఆసుపత్రిలో ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా క్లిష్టమైన శస్త్రచికిత్సలు నిర్వహించి రోగుల మన్ననలు పొందుతోందని.. ప్రభుత్వ చొరవతో పాటు సీఎస్ఆర్, దాతల సహకారంతోనూ ఆసుపత్రి అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. శాసనసభ్యులు గద్దె రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. ఎ÷-లోరెన్స్ నైటింగేల్ సేవలు చిరస్మరణీయమని, ఆమె చూపిన సేవా మార్గం నేటికీ నర్సింగ్ వృత్తికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని మరింత మానవీయ దృక్పథంతో, ఆప్యాయతతో రోగులకు సేవలందించినప్పుడే ఆమెకు నిజమైన నివాళులు అర్పించినవారమవుతామని తెలిపారు. రాత్రీపగలు రోగుల్ని కంటికి రెప్పలా చూసుకుంటూ రోగాన్ని నయం చేసి ఇళ్లకు క్షేమంగా పంపిస్తూ నర్సులు ఆదరాభిమానాలు పొందుతున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాధనలో వైద్య సేవల్లో నాణ్యత అత్యంత ముఖ్యమని.. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అత్యంత నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు, ఆరోగ్య ఆంధ్ర సాధనకు విశేష కృషిచేస్తోందని పేర్కొన్నారు. ఏ ఆసుపత్రిలో లేనివిధంగా ఇక్కడ ఓపీ ఉంటోందని.. ఇక్కడ అందుతున్న నాణ్యమైన సేవలకు ఇది నిదర్శనమన్నారు. ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్‌లో 95 శాతానికిపైగా సంతృప్తి స్థాయి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. అన్ని విభాగాలూ అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేసినప్పుడే ఈ లక్ష్యాన్ని చేరుకోగలమని పేర్కొన్నారు. ప్రత్యేకంగా అత్యవసర పరిస్థితులు, క్లిష్ట సమయాల్లో నర్సులు చూపించే అంకితభావం, సహనం, సేవా దృక్పథం సమాజానికి ఆదర్శమని తెలిపారు. రోగులు త్వరగా కోలుకోవడంలో నర్సుల సంరక్షణ, మానసిక ధైర్యం ఎంతో ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ వైద్య రంగంలో నర్సులు అందిస్తున్న సేవలు అమూల్యమని.. రోగుల ఆరోగ్య పరిరక్షణలో వైద్యులతో సమానంగా నర్సులు కూడా అహర్నిశలు కష్టపడుతూ సేవలందిస్తున్నారని కొనియాడారు. సేవాభావం, సహనం, మానవత్వంతో నిండిన నర్సింగ్ వృత్తి సమాజానికి ఆదర్శప్రాయమని తెలిపారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి సేవలందించిన నర్సుల త్యాగాలను సమాజం ఎప్పటికీ మరవదని తెలిపారు. నర్సింగ్ సిబ్బంది సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు విద్యాసాగర్ వెల్లడించారు.

అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మొత్తం 35 మందిని గౌరవ అతిథులు సత్కరించారు. విధి నిర్వహణలో వీరు అందించిన సేవలను ఈ సందర్భంగా అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ఎ.ఏడుకొండలరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కృష్ణారావు, జిల్లా నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు క్షమాబేగం, కోశాధికారి కె.శివలీల, ఏపీ ఎన్‌జీజీవో జిల్లా అధ్యక్షకార్యదర్శులు డీఎస్ఎన్ రెడ్డి, పి.రమేష్, నగరశాఖ అధ్యక్షులు సీవీఆర్ ప్రసాద్, ఆసుపత్రి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ట్రాన్స్‌జెండర్ వెల్ఫేర్ బోర్డుకు కొత్త సభ్యులు

విశాఖ తిరుపతి కలెక్టర్లకు బోర్డులో ప్రాతినిధ్యం

బోర్డులో కొత్తగా ముగ్గురు ట్రాన్స్‌జెండర్లకు చోటు

అమరావతి,మే12: ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ స్టేట్ వెల్ఫేర్ బోర్డుకు కొత్త సభ్యులను నియమిస్తూ చంద్రబాబు సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. ట్రాన్స్‌జెండర్ హక్కుల పరిరక్షణ చట్టం-2019 ప్రకారం ఈ నియామకాలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రాతినిధ్యం కల్పించేలా కలెక్టర్లను ప్రభుత్వం నామినేట్ చేసింది. విశాఖపట్నం కలెక్టర్‌ను ఆంధ్ర ప్రాంతానికి ప్రతినిధిగా నియమించగా, తిరుపతి కలెక్టర్‌ను రాయలసీమ ప్రాంతానికి ప్రతినిధిగా నియమించింది. ఈ నిర్ణయం ద్వారా ప్రాంతీయ స్థాయిలో ట్రాన్స్‌జెండర్ సమస్యలు, సంక్షేమ కార్యక్రమాల అమలు మరింత సమర్థవంతంగా జరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ స్టేట్ వెల్ఫేర్ బోర్డులో నామినేట్ సభ్యులుగా ముగ్గురు ట్రాన్స్‌జెండర్ ప్రతినిధులకు అవకాశం కల్పించింది. కోట ప్రేమ్ సాగర్ రాయ్, నక్క జీవన్ కుమారి, బోను దుర్గలను బోర్డు సభ్యులుగా నియమించింది. ఈ నియామకాల ద్వారా ట్రాన్స్‌జెండర్లకు సంబంధించిన సమస్యలు నేరుగా ప్రభుత్వ దృష్టికి వెళ్లే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం, నియమిత సభ్యుల పదవీకాలం రెండేళ్ల పాటు ఉంటుంది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ నియామకాలు అమల్లో ఉంటాయని ఏపీ సర్కార్ స్పష్టం చేసింది. మహిళా, శిశు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జీఓ ఎంఎస్ నంబర్14 విడుదల చేసింది. ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్లకు విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక భద్రత వంటి అంశాల్లో మరింత సహకారం అందించేందుకు చర్యలు చేపడుతోంది. ట్రాన్స్‌జెండర్ హక్కుల పరిరక్షణ చట్టం-2019 అమల్లో భాగంగా సంక్షేమ బోర్డు కీలక పాత్ర పోషించనుంది. సమాజంలో ట్రాన్స్‌జెండర్లకు సమాన



హక్కులు, గౌరవం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. ట్రాన్స్‌జెండర్ వెల్ఫేర్ బోర్డుకు సభ్యులను నియమించడంపై ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారంశైలజ మీడియాతో మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులు, సంక్షేమంపై కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. ట్రాన్స్‌జెండర్ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను మే 4వ తేదీన మంత్రి నారా లోకేశ్ దృష్టికి తాను తీసుకెళ్లానని ప్రస్తావించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ట్రాన్స్‌జెండర్ల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేయడం కూటమి సర్కారు చిత్తశుద్ధికి నిదర్శనమని రాయపాటి శైలజ పేర్కొన్నారు.

# పంచాయితీరాజ్‌కు మరోమారు గుర్తింపు

**చిత్తూరు జిల్లాకు రెండు జాతీయ అవార్డులు**

అమరావతి,మే12: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మరోసారి జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక గుర్తింపు పొందింది. వివిధ విభాగాల్లో రాష్ట్రంలోని గ్రామాలు, సంస్థలు జాతీయ అవార్డులను సొంతం చేసుకుని రాష్ట్రానికి గౌరవం తీసుకువచ్చాయి. చిత్తూరు జిల్లాకు రెండు జాతీయ అవార్డులు దక్కాయి. క్లమేట్ యాక్షన్ విభాగంలో చిత్తూరు జిల్లాలోని కందులవారిపల్లె గ్రామానికి జాతీయ అవార్డు లభించింది. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులపై గ్రామస్థాయిలో చేపట్టిన చర్యలకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కింది. అదేవిధంగా ఆత్మనిర్భర్ విభాగంలో చిత్తూరు జిల్లాలోని ప్రముఖ గ్రామమైన కాణిపాకం జాతీయ అవార్డు సాధించింది. గ్రామాభివృద్ధి, స్వయం సమృద్ధి కార్యక్రమాల అమల్లో కాణిపాకం చూపిన ప్రతిభకు ఈ గుర్తింపు లభించింది. సంస్థల విభాగంలో చిత్తూరు జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటర్‌కు కూడా జాతీయ అవార్డు దక్కింది. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల సమర్థవంతమైన అమలు, స్థానిక సంస్థలకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు ప్రకటించారు. కూటమి ప్రభుత్వ హయాంలో కేవలం 23 నెలల వ్యవధిలోనే ఆంధ్రప్రదేశ్ 19 జాతీయ అవార్డులు సాధించడం విశేషంగా నిలిచింది. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, పారదర్శక పాలనలో ఏపీ ముందంజలో ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఒకేరోజు అత్యధిక గ్రామసభలను నిర్వహించి ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో రికార్డు సృష్టించింది. గ్రామస్థాయిలో ప్రజాపాలనను బలోపేతం చేయడం, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన చర్యలకు ఇది నిదర్శనంగా నిలిచింది.
పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయడం, ప్రజల భాగస్వామ్యంతో పాలన అందించడం వంటి అంశాలపై చంద్రబాబు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. జాతీయ అవార్డులు ఏపీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు గుర్తింపుగా అధికారులు భావిస్తున్నారు.

## నగరంలో మూడు చోట్ల చైన్ స్నాచింగ్‌లు

వరంగల్,మే12(సాక్ష్యం): జిల్లాలో చైన్ స్నాచర్లు, పోకిరీల రెచ్చిపోతున్నారు. సోమవారం రాత్రి మూడు చోట్ల చైన్ స్నాచింగ్ సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఒక వ్యక్తితో సహా ఇద్దరు మహిళల మెడలో బంగారు గొలుసులను దొంగలు తెంచుకెళ్లారు. ఈ సంఘటనలు స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. వరంగల్ మిల్స్ కాలనీలో పోకిరీలు హంగామా సృష్టించారు. రాత్రి సమయంలో కొందరు యువకులు బైక్‌లపై తిరుగుతూ ప్రజలను భయపెడుతున్నట్లు తెలుస్తోంది. కాలనీలోని ఓ టీ స్టాల్ యజమానిపై పోకిరీలు దాడి చేశారు. దాడిలో టీ స్టాల్ యజమాని తీవ్రంగా గాయపడ్డాడని, అతన్ని స్థానికులు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. నగరంలో పోలీసు పెట్రోలింగ్ పూర్తిగా కనిపించడం లేదని ప్రజలు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. రాత్రి సమయంలో మహిళలు, వృద్ధులు ఒంటరిగా బయటకు రావడానికి భయపడుతున్న పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలో దొంగలు బీభత్సం సృష్టించారు. రాత్రి ఓ ఇంటి తాళాలు పగలగొట్టిన దుండగులు భారీగా బంగారు నగలు, వెండిని అపహరించారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అన్నా డిఎంకెలో లుకలుకలు

**పళనిస్వామి నాయకత్వంపై తిరుగుబాటు**
**టివికెకు మద్దతు ప్రకటించిన షణ్ముగం వర్గం**

చెన్నై,మే12(సాక్ష్యం): తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం అన్నాడీఎంకే లో లుకలుకలు బయటపడ్డాయి. పళనిస్వామి నాయకత్వంపై తిరుగుబాటు మొదలయ్యింది. తాజాగా ఆ పార్టీలోని సీవీ షణ్ముగం వర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని తమిళగ వెట్రి కళగంకు మద్దతు ప్రకటించింది. ఆయన వర్గంలో 30 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. డీఎంకేతో చేతులు కలపాలని అన్నాడీఎంకే అనుకుందని, అందుకే పళనిస్వామి వర్గం నుంచి తాము విడిపోయామని మంగళవారంనాడు మీడియాతో మాట్లాడుతూ షణ్ముగం తెలిపారు. ఎన్డీయే కూటమి నుంచి బయటకు వచ్చినట్టు చెప్పారు. వరుస ఓటములకు పళనిస్వామే కారణమని విమర్శించారు. పార్టీ పదవి నుంచి ఆయన దిగిపోవాలని డిమాండ్ చేశారు. అన్నాడీఎంకే గత దశాబ్ద కాలంగా పలు ఓటములను చవిచూసిందని, మూడుసార్లు చిరకాల ప్రత్యర్థి డీఎంకే చేతిలో ఓడిపోతే, గత నెలలో టీవీకే చేతిలో మరో ఓటమి చవిచూసిందని షణ్ముగం తెలిపారు. పార్టీని పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అన్నాడీఎంకే భవిష్యత్తుపై కూలంకషంగా చర్చించాలని అన్నారు. ఎన్నికల్లో విజేతగా నిలిచిన టీవీకేకు మద్దతివ్వాలని మేము నిర్ణయించాం. డీఎంకేకు వ్యతిరేకంగానే అన్నాడీఎంకే పార్టీని స్థాపించడం జరిగింది. 53 ఏళ్లుగా డీఎంకేకు వ్యతిరేకంగానే పార్టీ రాజకీయాలు నడిచాయి. చరిత్ర ఇలా ఉంటే డీఎంకే మద్దతుతో అన్నాడీఎంకే ప్రభుత్వం ఏర్పాటు కావాలనే ప్రతిపాదన ముందుకు తెచ్చారు. అయితే మెజారిటీ సభ్యులు ఈ ప్రతిపాదనను తోసిపుచ్చారు. డీఎంకేతో పొత్తు పెట్టుకోవడం అంటే అన్నాడీఎంకే సొంత ఉనికి కోల్పోవడమే అవుతుంది. ప్రస్తుతం మా దృష్టి ఉంతా పొత్తులపై లేదు. సొంత పార్టీని పునరుద్ధరించి, పటిష్టం చేయడమే మా ఉద్దేశం. అంతిమంగా ఎన్నికల్లో విజయం సాధించిన టీవీకేకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించాం' అని షణ్ముగం తెలిపారు. సొంత పార్టీని చీల్చే ఉద్దేశం లేదని షణ్ముగం వివరణ ఇచ్చారు. పార్టీ కీలక నాయకత్వంపై పోరాటంగా దీనిని పేర్కొన్నారు. ముఖ్యంగా విజయ్, టీవీకేతో పొత్తుకు గత వారంలో నిరాకరించిన మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామికి వ్యతిరేకంగా తామంతా తీసుకున్న నిర్ణయమని చెప్పారు.

## భగీరథ్ కేసులో నా వ్యాఖ్యలు వక్రీకరించారు

బాధితురాలికి కూడా న్యాయం జరగాలని కోరా
మరోమారు వివరణ ఇచ్చిన మంత్రి పొన్నం

హైదరాబాద్,మే12(సాక్ష్యం): కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసులో బాధితురాలికి న్యాయం చేయాలని మాత్రమే తాను మాట్లాడానని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ కేసులో బాధితురాలికి న్యాయం చేసే అంశంపైనే తాను మాట్లాడానని.. తన మాటలను కొంతమంది వక్రీకరించారని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం మాట్లాడారు. ఈ కేసులో భగీరథ్ విచారణ ఎదుర్కొని తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని తాను అన్నానని ప్రస్తావించారు. ఈ విషయంలో కాంగ్రెస్ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మున్నూరు కాపు సంఘాలు ఆరోపణలు చేశాయని అన్నారు. ఈ కేసులో బాధితురాలు కూడా అదే సామాజిక వర్గమని తాను చెప్పానని ప్రస్తావించారు. తన ఉద్దేశంలో కూడా బాధితురాలికి న్యాయం జరగాలనే తపన మాత్రమే ఉందని అన్నారు. ఇందులో ఎక్కడ కూడా కాంప్రమైజ్ కావాలని తాను మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. బాధితురాలికి కాంగ్రెస్ అండగా ఉంటుందని.. వారికి పూర్తిగా మద్దతుగా ఉంటామని స్పష్టం చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు తాను పోరాడతానని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## చిన్నారి హత్య కేసులో నిందితుడికి మరణ శిక్ష

కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పు

హైదరాబాద్,మే12(సాక్ష్యం): ఓ బాలుడి హత్య కేసులో కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పునిచ్చింది. చిన్నారిని హత్య చేసిన వ్యక్తికి మరణశిక్ష విధించింది. హైదరాబాద్ సనత్‌నగర్‌లో 2023 సంవత్సరంలో జరిగిన మైనర్ హత్యోదంతం సంచలనం సృష్టించింది. ఇమ్రాన్ అలీ ఖాన్ (33) అనే వ్యక్తి చిన్నారిని హత్య చేయగా.. అతనికి మహమ్మద్ రఫీక్ (32) సహకరించాడనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై సనత్‌నగర్ పోలీసులు అప్పుడే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు ఇమ్రాన్ అలీ ఖాన్, మహమ్మద్ రఫీక్‌ను గుర్తించి అరెస్టు చేశారు. కేవలం సాంకేతిక సాక్ష్యాలతో కేసును ఛేదించి.. వివరాలను కోర్టుకు సమర్పించారు. పకడ్బందీగా సాక్ష్యాలు ఉండటంతో సంతృప్తి చెందిన కూకట్‌పల్లి కోర్టు.. చిన్నారిని వారే హత్య చేసినట్లు నిర్ధారిస్తూ దోషులుగా తేల్చింది. ఇమ్రాన్ అలీ ఖాన్‌కు మరణశిక్ష, అతనికి సహకరించిన మహమ్మద్ రఫీక్‌కు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. ఈ మేరకు 3వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం.వెంకటేశ్వర రావు తీర్పు వెలువరించారు.

## ఆనాటి జైళ్లు దుర్భరంగా ఉండేవి

మొదటిపేజీ తరువాయి..

ఉందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తెలిపారు. మంగళవారం చంచల్‌గూడ జైలులో ఏర్పాటు చేసిన మ్యూజియం, ఫీల్ ది జైల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. స్వాతంత్రానికి పూర్వం జైల్లో గడిపిన వారు ఎలా ఉండేవారనే విషయం ఈ మ్యూజియంను చూస్తే తెలుస్తుందన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభించడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు.

ఈ మ్యూజియంలో ఉన్నది కేవలం ఇతిహాసానికి సంబంధించిన వస్తువులు కాదన్నారు. స్వాతంత్రానికి ముందు జైళ్లలో ఉన్నవారు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారో ఈ మ్యూజియం ద్వారా తెలుస్తుందని చెప్పారు. శిక్షల పేరుతో సంస్కారాన్ని, శరీరాన్ని, మనస్తత్వాన్ని విరగ్గొట్టే ప్రయత్నం చేశారని బ్రిటిష్ పాలనలో సాగిన అకృత్యాలను ఆయన వివరించారు.

మన కోసం మన పూర్వీకులు పడ్డ కష్టాన్ని తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలని ప్రజలకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో తాను పలుమార్లు జైలుకు వెళ్లానన్నారు. ఎమర్జె÷న్సీ సమయంలో 21 రోజులు తాను జైల్లో ఉన్నానని ఆయన గుర్తు చేసుకున్నారు. అప్పుడే జైలు ఎలా ఉంటుందో తనకు తెలిసిందని వివరించారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో కళ్యాణ్ సింగ్ ప్రభుత్వంలో జైళ్ల శాఖ మంత్రిగా తాను పని చేశానని తెలంగాణ గవర్నర్ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జైళ్లలో తాను పలు సంస్కరణలు తీసుకొచ్చానని తెలిపారు. ఈ సంస్కరణలతో ఖైదీలు సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు. ఈ రోజు మ్యూజియంలో చూసిన దృశ్యాలతో.. మళ్లీ ఆనాటి జ్ఞాపకాలు తనకు గుర్తుకు వచ్చాయన్నారు. ఖైదీలలో ప్రతి ఒక్కరూ క్రిమినల్స్ కాదని.. పరిస్థితులు వారిని ఆ సమయంలో నిందితులుగా మార్చాయని వివరించారు. ఖైదీలలో మార్పు తీసుకురావడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జైలు అధికారులకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. మరోసారి తప్పుచేసే ఆలోచన రాకుండా ఖైదీల్లో పరివర్తన తీసుకురావాలని అధికారులకు స్పష్టం చేశారు. సాధారణ ప్రజల కోసం చంచల్‌గూడ జైలు అధికారులు



వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. జైలు ఆవరణలో 'జైల్ మ్యూజియం', 'ఫీల్ ది జైల్' పేరుతో ప్రత్యేక బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రారంభించారు. ఇప్పటికే గోవా, కోల్‌కతా వంటి ప్రాంతాల్లో జైలు మ్యూజియాలు ఉన్నాయి. తాజాగా హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు కూడా ఈ జాబితాలో చేరింది. జైల్ మ్యూజియంలో జైలు చరిత్ర, ఉపయోగించిన పాత వస్తువులు, ఖైదీల జీవితం, శిక్షల విధానాలు వంటి అంశాలను ప్రదర్శించనున్నారు. ఇది విద్యార్థులు, పర్యాటకులు, సాధారణ ప్రజలకు జైలు వ్యవస్థ గురించి అవగాహన కల్పించడానికి ఉపయోగపడనుంది. 'ఫీల్ ది జైల్' బ్యారక్ ద్వారా సాధారణ ప్రజలు ఒకరోజు జైలు జీవితాన్ని అనుభవించేలా జైలు అధికారులు అవకాశం కల్పించారు. ఫీజు చెల్లించి రిజర్వేషన్ చేసుకున్నవారు జైలు రూల్స్ ప్రకారం ఒక రోజు బ్యారక్‌లో ఉండి, జైలు ఆహారం, రొటీన్ కార్యకలాపాలు, శిక్షల వాతావరణాన్ని అనుభవించవచ్చు. ఇది జైలు జీవితం ఎంత కష్టమో అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందని అధికారులు తెలిపారు.

# నీట్ ప్రవేశ పరీక్ష రద్దు

మొదటిపేజీ తరువాయి..

పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. త్వరలోనే కొత్త పరీక్ష తేదీలను వెల్లడిస్తామని తెలిపింది. విద్యార్థుల ప్రయోజనాలు, జాతీయ పరీక్షా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. కొత్త పరీక్ష కోసం విద్యార్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, పరీక్ష ఫీజు చెల్లించనక్కర్లేదని తెలిపింది. పరీక్ష తేదీలను నిర్ణయించిన తర్వాత మళ్లీ అడ్మిట్ కార్డులు విడుదల చేస్తామని పేర్కొంది. ఇక, ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది.

ఈనెల 3న జరిగిన నీట్ పరీక్షలో కెమిస్ట్రీ విభాగంలో వచ్చిన సుమారు 120కి పైగా ప్రశ్నలతో ఉన్న ఓ ప్రాక్టీసు పేపరును గుర్తించినట్లు రాజస్థాన్ అదనపు డీజీపీ విశాల్ బన్సాల్ వెల్లడించారు. ఈ మెటీరియల్ రాజస్థాన్‌లోని సికార్‌లో పరీక్షకు 42 గంటల ముందు వాట్సాప్‌లో అందుబాటులోకి వచ్చినట్లు గుర్తించారు. ఇందులోని సమాచారం.. నీట్ ప్రశ్నపత్రంలోని 600 మార్కుల ప్రశ్నలతో పోలి ఉండటం గమనార్హం. కొన్ని ప్రశ్నల్లోని జవాబుల క్రమం కూడా అచ్చం ఒకేలా ఉండడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఆ ప్రాక్టీసు పేపరు కేరళలోని ఓ వైద్య కళాశాలలో చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థికి చెందినదిగా దర్యాప్తులో వెల్లడైంది. ఆ వ్యక్తి ఈనెల 1న సికార్‌లోని తన స్నేహితుడికి ఈ మెటీరియల్ ఇచ్చాడని.. ఆ తర్వాత అది పీజీ వసతిగృహాలు, కోచింగ్ నెట్‌వర్క్‌లు, కెరీర్ కౌన్సిలర్లు, పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు చేరిందని అధికారులు తెలిపారు. ఆ మెటీరియల్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీకి సంబంధించిన 300కు పైగా చేతిరాత ప్రశ్నలు ఉన్నాయని వెల్లడించారు. దీనిని విద్యార్థులకు రూ.20వేల నుంచి రూ.2 లక్షల వరకు విక్రయించారని, కొందరు అభ్యర్థుల నుంచి ముందుగానే రూ.30 వేలకు పైగా వసూలుచేశారని గుర్తించామని రాజస్థాన్ పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే పలువురు అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పేపర్ లీక్ కేసు వ్యవహారంలో 13 మందిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వీరిని పోలీసులు విచారిస్తున్నారు. 'గెస్ పేపర్' పేరుతో మార్కెట్‌లోకి ఈ నీట్ ప్రశ్నాపత్రం వచ్చింది. ప్రభుత్వం నిర్వహించిన ప్రశ్నాపత్రంతో ఈ 'గెస్ పేపర్' 100 శాతం సరి పోలినట్లు అధికారులు గుర్తించారు. అలాగే మే 3వ తేదీన ఈ నీట్ పరీక్ష నిర్వహించగా.. అంతకు ముందే ఈ పరీక్ష పేపర్ లీక్ అయినట్లు అధికారులు ధృవీకరించారు. ఈ ప్రశ్నాపత్రం రూ. 20 వేల నుంచి రూ. 2 లక్షల వరకు విక్రయించినట్లు గుర్తించారు. కేరళలోని ఒక ఎంబీబీఎస్ విద్యార్థి వద్ద ఈ పేపర్ లీక్ అయినట్లు పోలీసులు కనుగొన్నారు. మే 1వ తేదీన సికార్‌లోని స్నేహితుడితో ఎంబీబీఎస్ విద్యార్థి ఈ ప్రశ్నాపత్రం పంచుకున్నట్లు తెలుస్తుంది. ఆ తర్వాత కోచింగ్ సెంటర్లు, అభ్యర్థులకు ఈ పేపర్ లీక్ అయినట్లు సమాచారం.

# అసోం సీఎంగా హిమంత బిశ్వశర్మ



మొదటిపేజీ తరువాయి..

ఉదయం 11.40 గంటలకు గువాహటిలోని వెటర్నరీ కాలేజీ ఫీల్డ్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. బిశ్వ శర్మతో పాటు బీజేపీ నుంచి ఇద్దరు, ఏజీపీ, బీపీఎఫ్ నుంచి ఒక్కొక్కరు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. అస్సాంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడం ఇది వరుసగా మూడోసారి కాగా, అసోం ముఖ్యమంత్రిగా శర్మ పగ్గాలు చేపట్టడం రెండోసారి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, పలువురు కేంద్ర మంత్రులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సహా పలువురు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు హాజరయ్యారు. హిమంత బిశ్వ శర్మతో పాటు రామేశ్వర్ తేలి, అతుల్ బోరా, చరణ్ బోరో, అజంతా నియోగ్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, కొత్త టీమ్‌తో కలిసి పూర్తి అంకితభావంతో పటిష్టమైన, మరింత అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన అస్సాంను నిర్మిస్తామని శర్మ ప్రకటించారు. హిమంత బిశ్వ శర్మ తొలిసారి 2021లో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. మొత్తం 126 స్థానాల్లో ఎన్డీయే 102 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 82 సీట్లు దక్కించుకోగా, భాగస్వామ్య పార్టీలైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు గెలుచుకున్నాయి. కాంగ్రెస్ సారథ్యంలోని కూటమికి 19 సీట్లు వచ్చాయి. భాజపా ఒక్కటే 82 సీట్లు గెలుచుకోగా.. దాని కూటమి భాగస్వాములైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు దక్కించుకున్నాయి. దీంతో ఎన్డీఏ రాష్ట్రంలో వరుసగా మూడోసారి తమ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ఈ కార్యక్రమానికి ముందు వేదిక వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తచ్చాడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. తనిఖీ చేయగా అతడి వద్ద తుటాలు లభ్యమయ్యాయి. వెంటనే అనుమానితుడిని బసిస్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టామన్నారు. హిమంత ప్రమాణస్వీకార కార్యక్రమానికి పీఎం మోదీ సహా పలువురు కీలక నేతలు హాజరైన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.



## భగీరథకు సిట్ నోటీసులు

మొదటిపేజీ తరువాయి..

2 గంటలకు విచారణకు హాజరు కావాలని సిట్ అధికారులు ఆదేశించారు. సిట్ అధికారులు బుధవారం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌ను విచారించనున్నారు. ఈ కేసుకు సంబంధించిన పలు అంశాలపై ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు సమాచారం. బాధితురాలి స్టేట్‌మెంట్ నమోదు చేసిన అనంతరం పోలీసులు ఈ కేసులోని సెక్షన్లను మార్చారు. గతంలో నమోదు చేసిన పోక్సో యాక్ట్ సెక్షన్లను సవరించారు.

బండి భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో మధ్యంతర బెయిల్ కోరుతూ బండి భగీరథ్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టుకు వేసవి సెలవులు కావడంతో వెకేషన్ బెంచ్‌లో పిటిషన్ వేశారు. పిటిషన్‌పై ఈనెల 14న హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ జరిపే అవకాశం ఉంది. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు బండి భగీరథ్ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేస్తూ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసు సున్నితమైనది కావడంతో మహిళా ఐపీఎస్ అధికారిణి పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు. ఇప్పటికే బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయడం జరిగింది. సిట్ ఏర్పాటు నేపథ్యంలో మరోసారి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసే అవకాశం ఉంది. మరోవైపు బండి భగీరథ్ కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి అన్ని ఆధారాలను సేకరిస్తున్నామని, నేరం రుజువైతే నిందితుడిని కచ్చితంగా అరెస్ట్ చేస్తామని కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ స్పష్టం చేశారు.

తన కుమారుడు బండి భగీరథ్‌ను నేరస్థుడిగా చూపే ప్రయత్నం చేస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆవేదన చెందారు. తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని చెప్పారు. బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో సంజయ్ స్పందించారు. ఏ తప్పూ చేయలేదని నా కుమారుడు చెబుతున్నాడు. అతడిని నేను సమర్థించడం లేదు. చట్టాన్ని, న్యాయాన్ని గౌరవిస్తా. కోర్టు నిర్ణయాన్ని శిరసావహిస్తాం. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. నా కుమారుడిపై దాడిని చూసి కన్నపేగు తల్లడిల్లుతోంది.. డిప్రెషన్‌లోకి పోతోంది. నేను బాధపడుతున్నానని ప్రత్యర్థులు అనుకుంటున్నారు. నేనెప్పుడూ బాధపడను. కుట్రలు, కుతంత్రాలు చేసిన వారితో పాటు నా కుటుంబం, నా పార్టీని ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టను అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. చట్టం అందరికీ ఒక్కటేనని, తన కొడుకైనా మరెవరైనా తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు.

## తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా జేసీడీ ప్రభాకర్

మొదటిపేజీ తరువాయి..

చేసినట్టు ప్రోటెం స్పీకర్ ఎంవీ కరప్పయ్య తెలిపారు. తొలుత ప్రభాకర్ నామినేషన్‌ను ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ప్రతిపాదించారు. ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా స్పీకర్ ఎన్నిక జరిగింది. అనంతరం ప్రోటెం స్పీకర్‌గా తన పాత్ర ముగిసినట్టు కరుప్పయ్య ప్రకటించారు. ఆ వెంటనే సభాసాంప్రదాయం ప్రకారం స్పీకర్ ప్రభాకర్‌ను ఆయన చైర్ వరకూ సభానేత కేఏ సెంగోట్టియన్, ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ తోడ్కొని వెళ్లారు. ఆయనకు అభినందనలు తెలిపారు. స్పీకర్‌గా ప్రభాకర్ బాధ్యతలు చేపట్టిన వెంటనే డిప్యూటీ స్పీకర్ ఎన్నికను చేపట్టారు. డిప్యూటీ స్పీకర్ పదవికి తురైయూర్ టీవీకే ఎమ్మెల్యే ఎం.రవిశంకర్ ఒక్కరే నామినేషన్ వేశారని, దీంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైందని ప్రభాకర్ ప్రకటించారు. రవిశంకర్ నామినేషన్‌ను సెంగోట్టియన్ ప్రతిపాదించారు.

## ఉదయనిధి మరోమారు అనుచిత వ్యాఖ్యలు

**సనాతన ధర్మంపై నోరు పారేసుకున్న డిఎంకె నేత**
**ఉదయనిధి వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి నేత**

చెన్నై,మే12(సాక్ష్యం): తమిళనాడు మాజీ ఉప ముఖ్యమంత్రి, డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ మరోసారి సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. మూడేళ్ల క్రితం ఉదయనిధి సనాతన ధర్మంపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియాతో పోల్చుతూ దానిని నిర్మూలించాలని వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. పలువురు కోర్టులలో పిటిషన్లు కూడా వేశారు. తాజాగా, మంగళవారం మధ్యాహ్నం తమిళనాడు అసెంబ్లీలో కూడా ఉదయనిధి అదే తరహా వ్యాఖ్యలు చేశారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని అసెంబ్లీ వేదికగా ప్రసంగించారు. అసెంబ్లీ కొత్త స్పీకర్‌గా ఎన్నికైన జె.సి.డి. ప్రభాకర్‌ను అభినందిస్తూ చేసిన ప్రసంగంలో ఉదయనిధి స్టాలిన్ ఈ వ్యాఖ్య చేశారు. ఉదయనిధి వ్యాఖ్యలపై తమిళనాడు బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసన్ ఘాటుగా స్పందించారు. ఎన్నికల్లో ఓటమి ఎదురైనా ఆయన మారలేదని విమర్శించారు. డీఎంకే నిజంగా ఇదే సిద్ధాంతాన్ని నమ్మితే ఎన్నికల మేనిఫెస్టోలో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు

హిందూ మతాన్ని నిర్మూలించడమే ఉదయనిధి స్టాలిన్, డీఎంకేల విధానమైతే, దానిని వారి ఎన్నికల మేనిఫెస్టోలో ఎందుకు ప్రస్తావించలేదని మండిపడ్డారు. ఎన్నికల ప్రచార సమయంలో ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మం నిర్మూలన గురించి ఎందుకు మాట్లాడలేదు. ఎన్నికల ప్రచారం చివరి రోజున 'మేం హిందువులకు వ్యతిరేకం కాదు' అని స్టాలిన్ ఎందుకు చెప్పుకున్నారు' అని శ్రీనివాసన్ ప్రశ్నించారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్
# నవీన్‌కు ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు




**నర్సంపేట మే 12 (సాక్ష్యం న్యూస్ ) :** నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ కి రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రిన్సిపల్ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పురస్కారంతో పాటు కళాశాల అభివృద్ధి కోసం రూ. 1,00,000/- మరియు రూ. 10,000/- నగదు ప్రోత్సాహక చెక్కును అందజేయడం కళాశాలకు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ, ఈ పురస్కారం తన వ్యక్తిగత విజయమే కాకుండా కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల సమిష్టి కృషికి లభించిన గుర్తింపని అన్నారు. ఒక ప్రభుత్వ కళాశాల కూడా సంకల్పం, క్రమశిక్షణ, సమిష్టి కృషి ఉంటే రాష్ట్రంలోనే ఆదర్శ విద్యాసంస్థగా నిలవగలదని మేము నిరూపించామని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం మా బాధ్యత మాత్రమే కాదు, అది మా లక్ష్యమని ఆయన అన్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో వెలుగునింపే విద్యా దీపంగా కళాశాలను నిలుపుతానని, విద్యా ప్రమాణాలు, క్రమశిక్షణ, సాంకేతిక వనరులు, పరిశోధన, విద్యార్థుల అభివృద్ధి కార్యక్రమాలలో తెలంగాణ రాష్ట్రంలోనే ఉత్తమ కళాశాలగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. అంతేకాకుండా విద్యార్థుల కలలను నిజం చేయడం కోసం అధ్యాపక బృందంతో కలిసి మరింత అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నర్సంపేటను తెలంగాణ రాష్ట్రంలోనే అత్యుత్తమ విద్యా సంస్థగా నిలబెట్టడం తన కల అని తెలిపారు. విద్య, విలువలు, విజన్ అనే మూడు అంశాల ఆధారంగా కళాశాలను అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తూ ప్రతి తరగతి గది ఒక స్ఫూర్తి కేంద్రంగా, ప్రతి విద్యార్థి ఒక నాయకుడిగా ఎదగాలనే లక్ష్యంతో పనిచేస్తామని చెప్పారు. పోటీ పరీక్షల శిక్షణ, డిజిటల్ లెర్నింగ్, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, క్రీడలు మరియు వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. కళాశాల అభివృద్ధికి సహకరిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి, ఉన్నత విద్యాశాఖ అధికారులకు, అధ్యాపకులకు, బోధనేతర సిబ్బందికి, విద్యార్థుల తల్లిదండ్రులకు మరియు విద్యార్థులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సికేఎం కళాశాలలో ముగిసిన యోగా శిబిరం






**వరంగల్ మే12 (సాక్ష్యం న్యూస్) :** సికేఎం గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా జిల్లాస్థాయి మాస్ యోగా శిబిరం మంగళవారం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక వరంగల్ జిల్లా సమన్వయకర్త నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పోచయ్య , రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ ప్రేమలతాదేవి సంధానకర్తలుగా వ్యవహరించారు. ఈసందర్భంగా ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆరోగ్య చైతన్యం, క్రమశిక్షణ, మానసిక ప్రశాంతత పెంపొందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. యోగా ద్వారా శారీరక ఆరోగ్యం మాత్రమే కాక మానసిక స్థైర్యం, ఏకాగ్రత, జీవన విలువలు కూడా పెరుగుతాయని ఆయన తెలిపారు. విద్యా వారోత్సవాలు కేవలం కార్యక్రమాల సమాహారం మాత్రమే కాకుండా విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్య చైతన్యం, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించే మహత్తర వేదిక అని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వం విద్యా రంగాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకెళ్తుందని జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సమిష్టి భాగస్వామ్యంతో విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. అందుకు సహకరిస్తున్న ప్రతి ఆచార్యుడు, సిబ్బంది, విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను అని తెలిపారు. ఈకార్యక్రమానికి అధ్యక్షత వహించిన సి కె ఎమ్ కళాశాల ప్రిన్సిపల్ ఎ. ధర్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యోగా అలవాటు చేసుకుంటే ఒత్తిడి తగ్గి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని అన్నారు. విద్యా వారోత్సవాల ద్వారా ప్రభుత్వం విద్యతో పాటు ఆరోగ్యం, సామాజిక బాధ్యత, వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రొఫెసర్ పోచయ్య మాట్లాడుతూ యోగా భారతీయ సంస్కృతి యొక్క అమూల్యమైన వారసత్వం. నేటి వేగవంతమైన జీవనశైలిలో విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు యోగా ఎంతో అవసరం. ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. ప్రేమలత దేవి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యాన్ని కూడా సమానంగా పరిరక్షించుకోవాలని అన్నారు. ఆరోగ్యవంతమైన యువతే సమాజానికి బలమైన భవిష్యత్తును నిర్మిస్తుంది. విద్యా వారోత్సవాల ద్వారా ప్రభుత్వం విద్య, ఆరోగ్యం, సంస్కృతి, సామాజిక విలువలను సమన్వయం చేస్తూ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తోంది. యోగా గురువు వేదం సత్యం విద్యార్థులకు మరియు అధ్యాపకులకు యోగా ప్రాధాన్యతను వివరిస్తూ మాట్లాడుతూ, "ప్రతి రోజు కనీసం 30 నిమిషాలు యోగా చేస్తే శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. యోగా భారతీయ సంస్కృతికి ప్రతీక మాత్రమే కాదు, ఆరోగ్యకరమైన జీవితానికి మార్గదర్శకం" అని తెలిపారు. అనంతరం వివిధ యోగాసనాలు, ప్రాణాయామ పద్ధతులను ప్రదర్శిస్తూ పాల్గొన్న వారికి సాధన చేయించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ విజయ పాల్ రెడ్డి, కెప్టెన్ డాక్టర్ సతీష్ కుమార్, ఆయేషా,అనిల్, శ్రీనివాస్, రాంబాబు, రమేష్ వరంగల్ జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఆచార్యులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు
## పూజలో పాల్గొన్న సర్పంచ్ దాసరి రమేష్ భక్తులు



**ఖానాపురం మే 12 (సాక్ష్యం న్యూస్ ) :** ఖానాపురం మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని పురస్కరించమని ఆలయ ప్రధాన అర్చకులు పర్వతపు శివప్రసాద శాస్త్రి ఆధ్వర్యంలో భక్తుల గోత్రనామాలతో అర్చన చేసి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఖానాపురం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ దాసరి రమేష్ పూజలో పాల్గొని స్వామివారికి మొక్కలు చెల్లించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్రస్వామి, అభయాంజనేయ స్వామి దీవెనలతో ప్రజలు, పాడిపంట సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం హనుమాన్ స్వాములు 41 రోజుల కఠోర దీక్ష ఇరుముడి సందర్భంగా ఆలయంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు మచ్చిక అశోక్, పార్టీ నాయకులు వల్లెపు శ్రీనివాస్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ బాలాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్
# జయంతి వేడుకల్లో పాల్గొన్న మల్లారపు శ్రీనివాస్ కుమార్



**సికింద్రాబాద్, మే 12 (సాక్ష్యం) :** హనుమాన్ జయంతి సందర్భంగా మెట్టుగూడలోని శ్రీ బాలాంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వల్లారపు శ్రీనివాస్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని శ్రీ ఆంజనేయ స్వామి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ నిర్వాహకులు మరియు భక్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వల్లారపు శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ శాంతులతో ఉండాలని ఆంజనేయ స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీతాఫలమండి డివిజన్ అధ్యక్షుడు జి.వి. కృష్ణ, సీనియర్ నాయకులు పరిటాల విజయ్ కుమార్, చిరంజీవిరాజు, శేషిరేఖ, జగదీష్, పొట్టి శీను, జి.ఎం. రమేష్, రమాదేవి, పుప్పాల విజయ్ కుమార్, శంకర్ ముదిరాజ్, వెంకటస్వామి, మురళీకృష్ణ, చంద్రమోహన్, చందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న
# టిడిపి నేత వల్లారపు శ్రీనివాస్ కుమార్



**సికింద్రాబాద్, మే 12 (సాక్ష్యం):** హనుమాన్ జయంతి సందర్భంగా తార్నాక చౌరస్తాలోని గణేష్ టెంపుల్ ప్రాంగణంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ నాయకులు బండ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వల్లారపు శ్రీనివాస్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొని శ్రీ ఆంజనేయ స్వామి ఆశీస్సులు పొందారు. అనంతరం బండ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో హాజరైన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలను ప్రత్యేక శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీతాఫలమండి డివిజన్ అధ్యక్షుడు జి.వి. కృష్ణ, సీనియర్ నాయకులు పరిటాల విజయ్ కుమార్, నాగ మల్లీశ్వరి, బండ శివారెడ్డి, కాతా విజయ్ కుమార్, జగదీష్, పొట్టి శీను, జి.ఎం. రమేష్, చందర్ ముదిరాజ్, శంకర్ ముదిరాజ్, వెంకటస్వామి, మురళీకృష్ణ, చంద్రమోహన్, పుప్పాల విజయ్ కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# గుప్త నిధులను రికవరీ చేయాలి
## - స్కూల్ నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలి - చారిత్రక శివాలయం కూల్చివేతపై బిఆర్ఎస్ ఫిర్యాదు



**ఖానాపురం మే12 (సాక్ష్యం న్యూస్ ) :** వరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్ నగర్ లోని చింతలవనంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం అంటూ పురాతన శివాలయం కూల్చివేతకు ప్రత్యక్షంగా పరోక్షంగా కారకులైన అధికారులునాయకులు ,కాంట్రాక్టర్ ఆలయ కూల్చివేతలో వాడినటువంటి మిషన్లను వాటి ఓనర్లు డ్రైవర్లపై కేసు నమోదు చేసి చోరీ చేయబడిన చారిత్రక గుప్త నిధుల సంపదను రికవరీ చేయాలని బిఆర్ ఎస్ ప్రజాప్రతినిధులు , మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు అశోక్ నగర్ లో కాకతీయులు నిర్మించిన చారిత్రక శివాలయాన్ని కూల్చిన వారిపైన క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఖానాపురం పోలీస్ స్టేషన్ లో ఖానాపురం మండల బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ సంబంధించి అశోక్ నగర్ గ్రామంలోనే అనువైన స్థలం కావలసినంత ఉండగా చారిత్రక గుడిని కూల్చి గుడికింద సుమారు 24 అడుగుల లోతు గొయ్యి తవ్వడం ముమ్మాటికి గుప్త నిధుల వేట కోసమే అనేది బలమైన సాక్ష్యంగా కనిపిస్తున్నదన్నారు. ప్రభుత్వ అధికారుల ఎండోమెంట్ ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ అధికారుల అనుమతి లేకుండా అర్ధరాత్రి గుడిని కూల్చడం నిధుల దోపిడి కోసమే నన్నారు. గతంలో దేవాదాయ భూమిగా ఉన్న స్థలాన్ని ఈరోజు కావాలని కుట్రపూరితంగా ప్రభుత్వ స్థలంగా మార్చడంలోనే కుట్ర దాగి ఉందని విమర్శించారు. సంబంధిత ఆర్కియాలజీ ఎండోమెంట్ శాఖల పర్మిషన్ లేకుండా గుడిని కూలగొట్టిన వారి పైన తక్షణమే క్రిమినల్ కేసులో నమోదు చేయాలని బిఆర్ఎస్ పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నమని తెలిపారు. ఈకార్యక్రమంలో బిఆర్ ఎస్ నర్సంపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ తక్కళ్ళపెల్లి రవీందర్ రావు , మాజీ మార్కెట్ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ ,మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు ,మహాలక్ష్మి వెంకటనర్సయ్య ,ఖానాపురం సర్పంచ్ దాసరి రమేష్ ,మౌళన ,గుగులోత్ బాలు నాయక్ ,వేణుక్రిష్ణ , బాబురావు,అబోతుఅశోక్ ,ప్రవీణ్ ,తిరుపతిరెడ్డి, వల్లె శ్రీను ,జాటోత్ బాలు బిఆర్ ఎస్ మండల పార్టీనాయకులు, క్లస్టర్ బాధ్యులు, అనుబంధ సంఘాల నాయకులు గ్రామ పార్టీ అధ్యక్షులు , పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఆనందోత్సాహాలతో కిరణ్ మై
## - విలాస్ రావు వివాహ వార్షికోత్సవ వేడుకలు



**హైదరాబాద్, మే 12 (సాక్ష్యం):** కిరణ్ మై మరియు వి. విలాస్ రావు (మాజీ జాయింట్ డైరెక్టర్, ఏపీఎల్ఐజీ) దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు కుటుంబ సభ్యులు, బంధువులు, ఆత్మీయుల సమక్షంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఆనందోత్సాహాల నడుమ జరిగిన ఈ వేడుకలో కుటుంబ సభ్యుల ప్రేమాభిమానాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు డా. జితేందర్ రావు తనుగుల పాల్గొని దంపతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. వారు ఆయురారోగ్యాలతో, ఆనందంతో, ఐక్యతతో మరెన్నో సంవత్సరాలు కలిసి జీవించాలని ఆకాంక్షించారు. రేవతి తనుగుల కూడా కార్యక్రమంలో పాల్గొని దంపతులకు ఆశీస్సులు అందించారు. అలాగే విలాస్ రావు తల్లి ఇందుమతి హాజరై దంపతులను ఆశీర్వదించారు. ఈ వేడుకలో దంపతుల కుమార్తెలు, అల్లుడు, మనవలు, మనవరాళ్లు పాల్గొని కుటుంబ ఆనందాన్ని మరింత పెంచారు. కేక్ కటింగ్, ఆత్మీయ సంభాషణలు, కుటుంబ సభ్యుల శుభాకాంక్షలు, చిరునవ్వుల నడుమ కార్యక్రమం ఎంతో ఆహ్లాదకరంగా సాగింది. ఈ వివాహ వార్షికోత్సవ వేడుక కుటుంబ బంధాల మాధుర్యాన్ని, పెద్దల పట్ల గౌరవాన్ని, తరతరాల అనుబంధాన్ని ప్రతిబింబిస్తూ అందరికీ చిరస్మరణీయంగా నిలిచింది.

## ఎస్ఐఆర్‌కు రేషన్ డీలర్లు సహకరించాలి



**ఆర్మూర్ సాక్ష్యం న్యూస్ మే12:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ ఐ ఆర్ కార్యక్రమానికి రేషన్ డీలర్లు సహకరించాలని ఆర్మూర్ తాసిల్దార్ సత్యనారాయణ మంగళవారం తన కార్యాలయంలో రేషన్ డీలర్ తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ బి ఎల్ ఓ లకు తమ పరిధిలోని రేషన్ డీలర్లు ఓటర్ లిస్ట్ ఎస్ ఐ ఆర్ కు సహకరించాలని సూచించారు. ఆర్మూర్ మండలంలోని బిఎల్ఓ లు ఆయా గ్రామాలలోని రేషన్ డీలర్ల సహకారంతో ఎస్ ఐ ఆర్ ను వేగవంతం చేయాలని తాసిల్దార్ ఆదేశించారు. మండలంలోని ఆయా గ్రామాలలో రేషన్ డీలర్లకు పరిచయాలు అధికంగా ఉన్నందున ఎస్ ఐ ఆర్ కార్యక్రమం త్వరగా తిను పూర్తి అవుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మండలంలోని వివిధ గ్రామాల రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై చీత ఫోర్స్ మెరుపు దాడులు
## - రెండు భారీ లారీలు పట్టివేత - పోలీస్ కమీషనర్ వెల్లడి






**ఆర్మూర్ సాక్ష్యం న్యూస్ మే 12:** అక్రమ ఇసుక, మైనింగ్ పై చీతా ఉక్కు పాదం మోపుతుంది. ప్రకృతి వరప్రదాయని అయినా ఇసుక, మొరం, మైనింగ్ లను కొందరు అక్రమార్కులు రవాణా చేస్తూ ధనార్జన చేసుకుంటున్నారు. ప్రకృతిని కొల్లగొడితే రాబోయే తరాలలో విపత్కర పరిణామాలు ఉంటాయని గ్రహించిన నిజాంబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య చీతా పేరట ఏర్పరిచిన ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడులను నిర్వహించి అక్రమ రవాణాను అడ్డుకుంటున్నారు. తాజాగా మంగళవారం ఆర్మూర్, మోర్తాడ్ మండలాలపై దాడులు నిర్వహించి, అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక లారీలను సీజ్ చేశారు. జిల్లాలో అక్రమ ఇసుక రవాణా ,మైనింగ్ కార్య కలాపాలను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక సి.సి.ఎస్ ఏసీపీ ఇన్‌చార్జ్ మస్తాన్ అలీ గారి ఆధ్వర్యంలో చీత ఫోర్స్ సిబ్బంది నిత్యం ప్రత్యేక నిఘా నిర్వహిస్తూ ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. మోర్తాడ్ పోలీస్ స్టేషన్ పరిధి, ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చీత ఫోర్స్ బృందం విస్తృత తనిఖీలు నిర్వహించింది. రహస్య సమాచారం మేరకు అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇసుక లారీలను గుర్తించిన పోలీసులు వెంటనే వాటిని అడ్డుకుని తనిఖీ చేశారు. తనిఖీల్లో రెండు 14 టైర్ల భారీ వాహనాల్లో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు, రవాణా పత్రాలు, మైనింగ్ సంబంధిత డాక్యుమెంట్లు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో వెంటనే వాహనాలను స్వాధీనం చేసుకుని, డ్రైవర్లు, సంబంధిత వ్యక్తుల వివరాలను నమోదు చేశారు. పట్టుబడిన లారీలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం సంబంధిత మోర్తాడ్, ఆర్మూర్ పోలీస్ స్టేషన్ లకు తరలించి ఎస్ . హెచ్.ఓ లకు అప్పగించారు. కేసు నమోదు చేసి , ఇసుక ఎక్కడి నుండి తరలిస్తున్నారు , దీనికి సంబంధించి మరెవరు ఉన్నారు అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. అక్రమ ఇసుక రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం వాటిల్లడమే కాకుండా , నదీ పరివాహక ప్రాంతాలు దెబ్బతిని పర్యావరణ సమతుల్యతకు ముప్పు ఏర్పడుతోందని అధికారులు తెలిపారు. అనధికారికంగా ఇసుక తవ్వకాలు జరగడం వల్ల భూగర్భ జలాల స్థాయి తగ్గిపోవడం , వ్యవసాయ భూములపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో అక్రమ మైనింగ్, ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రి వేళల్లో కూడా ప్రత్యేక బృందాలతో చెక్‌పోస్టులు , ప్రధాన రహదారులు, గ్రామీణ మార్గాల్లో తనిఖీలు మరింత ముమ్మరం చేయనున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ప్రజలు కూడా తమ పరిసర ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నట్లు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీస్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని పోలీసులు కోరారు.



# మరో వివాదంలో షాహీన్ షా అఫ్రిది

పాకిస్థాన్ పేసర్ షాహీన్ షా అఫ్రిది మరో వివాదంలో చిక్కుకున్నాడు. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా బంగ్లాదేశ్‌తో ఢాకా వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్‌లో షాహీన్ అఫ్రిది బాల్ టాంపరింగ్‌కు ప్రయత్నిస్తూ టీవీ కెమెరాలకు చిక్కాడు. బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్ సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకుంది. బౌలింగ్ చేసే సమయంలో అఫ్రిది.. బంతిని తన షూస్ కింద వేసి బలంగా నొక్కే ప్రయత్నం చేశాడు. ఈ విషయాన్ని గమనించిన అంపైర్ వెంటనే బంతిని చెక్ చేసి.. ఆకారం దెబ్బతినకపోవడంతో బౌలింగ్‌కు అనుమతిచ్చాడు. దాంతో అఫ్రిది ఆ ఓవర్‌ను పూర్తి చేశాడు. అయితే ఈ వీడియో నెట్టింట వైరల్ కాగా.. అఫ్రిదిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాల్ టాంపరింగ్‌కు ప్రయత్నించిన అతనిపై మ్యాచ్ రిఫరీ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో ఫకార్ జమాన్ బాల్ టాంపరింగ్‌కు ప్రయత్నించి దొరికిపోయాడు. అతనిపై నిర్వాహకులు భారీ జరిమానా విధించారు. ఈ ఘటనను మరిచిపోకముందే మరో పాక్ ఆటగాడు బాల్ టాంపరింగ్‌కు యత్నించడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ విజయం దిశగా సాగుతోంది. 268 పరుగుల లక్ష్యంతో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన పాకిస్థాన్ 121 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. క్రీజులో సౌద్ షకీల్, మహమ్మద్ రిజ్వాన్ ఉన్నారు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 413 పరుగుల భారీ స్కోర్ చేసింది. కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ షాంటో (101), మోమినుల్ హక్ (91), ముష్ఫికర్ రహీమ్ (71) రాణించారు. పాకిస్థాన్ బౌలింగ్‌లో మహ్మద్ అబ్బాస్(5/92) ఐదు వికెట్లు తీయగా.. షాహీన్ షా అఫ్రిది 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 386 పరుగులకు ఆలౌటైంది. ఇమామ్-ఉల్-హక్ (120), అబ్దుల్లా ఫజల్ (120) శతకాలతో రాణించారు. 27 పరుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్ 240/9 స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. నజ్ముల్ హుస్సేన్ షాంటో (87), మోమినుల్ హక్ (56) రాణించారు.

# కోహ్లి, ద్రావిడ్ సరసన శ్రేయాస్ అయ్యర్

ఐపీఎల్ లో కొన్ని జట్లపై కొందరు ఆటగాళ్లకు అదిరిపోయే రికార్డు ఉంటుంది. పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ కు ఢిల్లీ క్యాపిటల్స్ అంటే చాలా ఇష్టం అని మరోసారి నిరూపితమైంది. సోమవారం జరిగిన మ్యాచ్ లో శ్రేయాస్ చెలరేగి ఆడి ఒక అరుదైన ఎలైట్ లిస్ట్ లో చోటు సంపాదించాడు. గతంలో ఐపీఎల్ లెజెండ్స్ అయిన రాహుల్ ద్రావిడ్, విరాట్ కోహ్లి మాత్రమే ఢిల్లీపై వరుసగా మూడు హాఫ్ సెంచరీలు చేసిన రికార్డు కలిగి ఉండగా, ఇప్పుడు శ్రేయాస్ కూడా వారి సరసన చేరాడు. శ్రేయస్ ఈ రికార్డు అందుకోవడంపై పంజాబ్ ఫ్యాన్స్ ఫుల్ హేపీగా ఉన్నారు. ఐపీఎల్ చరిత్రలో ఒకే టీమ్ పై వరుసగా మూడు సార్లు 50 కంటే ఎక్కువ పరుగులు చేసిన వారి జాబితా పరిశీలిస్తే, రాహుల్ ద్రావిడ్ (రాజస్థాన్ రాయల్స్ తరఫున, 2012–13 లో), విరాట్ కోహ్లి (ఆర్సీబీ తరఫున, 2012–13 , 2016–17 లో రెండు సార్లు), శ్రేయాస్ అయ్యర్ (పంజాబ్ కింగ్స్ తరఫున, 2025–26 లో) ఉన్నారు. శ్రేయాస్ తన పాత ఫ్రాంచైజీ అయిన ఢిల్లీపై ఎప్పుడూ కంప్లీట్ కంట్రోల్ తో కనిపిస్తాడు. ఈ మ్యాచ్ లో కూడా 157.14 స్ట్రైక్ రేట్ తో బ్యాటింగ్ చేసి అపోజిషన్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఢిల్లీపై అతని చివరి స్కోర్లు చూస్తే 54, 42, 18, 33 నాటౌట్, 53, 71 నాటౌట్, 59 నాటౌట్ గా ఉన్నాయి. దీన్ని బట్టి చూస్తే ఢిల్లీ బౌలర్లు శ్రేయాస్ ను అవుట్ చేయడానికి ఎంత కష్టపడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ధర్మశాల మైదానంలో పంజాబ్ కింగ్స్ కు ప్రియాన్ష్ ఆర్య అదిరిపోయే స్టార్ట్ ఇచ్చాడు. కేవలం మూడు ఓవర్లలోనే జట్టు



స్కోరును 51 పరుగులకు తీసుకెళ్లాడు. అయితే మిడిల్ ఓవర్లలో ఢిల్లీ బౌలర్లు కట్టడి చేయాలని చూసినా శ్రేయాస్ అయ్యర్ తన అనుభవంతో ఇన్నింగ్స్ ను ముందుకు నడిపించాడు. అనవసరమైన రిస్క్ తీసుకోకుండా సింగిల్స్ తీస్తూనే, లూజ్ బంతులను బౌండరీలకు తరలించాడు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో గేర్ మార్చి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. కూపర్ కానోలీతో అతను నెలకొల్పిన 83 పరుగుల పార్టనర్ షిప్ మ్యాచ్ లో హైలైట్ గా నిలిచింది. ఒకవైపు వికెట్లు పడుతున్నా శ్రేయాస్ ఏమాత్రం ఒత్తిడికి లోను కాలేదు. మ్యాచ్ పరిస్థితికి తగ్గట్టుగా బ్యాటింగ్ చేస్తూ పంజాబ్ కు గౌరవప్రదమైన స్కోరును అందించాడు. ఢిల్లీ బౌలర్లు ప్లాన్ల మీద ప్లాన్లు వేసినా శ్రేయాస్ దగ్గర అన్నింటికీ సమాధానం చెప్పాడు. టాప్–2 రేసులో ఉండాలంటే ప్రతి మ్యాచ్ గెలవాల్సిన స్థితిలో పంజాబ్ కు తన కెప్టెన్ ఇలాంటి ఫామ్ లో ఉండటం పెద్ద ప్లస్ పాయింట్. ఢిల్లీపై అతని ట్రాక్ రికార్డ్ చూస్తుంటే భవిష్యత్తులో మరిన్ని రికార్డులు బద్దలు కొట్టడం ఖాయమనిపిస్తోంది.



# చాలా మంది నా మసిల్స్‌పై కామెంట్లు చేశారు

## భారత మహిళల క్రికెట్ స్టార్ స్మృతి మంధానా

ఈమధ్య ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో స్మృతి మంధానా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఒకసారి తాను చేతులు స్పష్టంగా కనిపించే డ్రెస్ వేసుకున్నానని తెలిపింది. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయిన తర్వాత చాలా మంది తన మసిల్స్‌పై కామెంట్లు చేశారని చెప్పింది.అథ్లెట్‌గా ఉండే వ్యక్తికి మసిల్స్ ఉండటం సాధారణమని, అది గర్వపడాల్సిన విషయమని స్మృతి తెలిపింది. "మేము ఫిట్‌గా ఉండేందుకు జిమ్‌లో చాలా కష్టపడతాం. మహిళా క్రీడాకారిణులు ప్రతిరోజూ ట్రైనింగ్ తీసుకుంటారు. శరీరం బలంగా ఉండాలి. ఫిట్‌నెస్‌ను ప్రశంసించాలి కానీ ట్రోల్ చేయకూడదు" అని ఆమె చెప్పింది.నాకు మంచి మసిల్స్ ఉన్నాయని కూడా ట్రోల్ చేశారు. అది చాలా ఫన్నీ విషయం" అని స్మృతి నవ్వుతూ చెప్పింది. ఆమె వ్యాఖ్యలకు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున మద్దతు లభించింది. చాలా మంది అభిమానులు ఆమె ధైర్యాన్ని ప్రశంసించారు.మహిళా అథ్లెట్లను వారి ప్రతిభ కంటే రూపం ఆధారంగా ఎక్కువగా జడ్జ్ చేస్తారని కొందరు నెటిజన్లు కామెంట్లు చేశారు. పురుష క్రికెటర్ల విషయంలో ఇలాంటి ట్రోలింగ్ చాలా తక్కువగా ఉంటుందని కూడా అభిప్రాయపడ్డారు. ఇది స్మృతి మంధానాకు మొదటిసారి ఎదురైన ట్రోలింగ్ కాదు. గతంలో బెంగళూరులో జరిగిన ఒక ఈవెంట్‌లో తీసిన ఫొటోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అప్పట్లో కూడా కొందరు ఆమె రూపంపై నెగటివ్ కామెంట్లు చేశారు. అయితే అభిమానులు మాత్రం ఆమెకు బలంగా మద్దతుగా నిలిచారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఎన్నో రికార్డులు సృష్టించిన స్మృతి మంధానా ప్రస్తుతం మహిళల క్రికెట్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన ఆటగాళ్లలో ఒకరిగా కొనసాగుతోంది.



# టీ20 లీగ్‌లో టీమ్‌ను కొనుగోలు చేసిన ద్రవిడ్

టీమిండియా మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్‌లో ఓ ఫ్రాంచైజీని కొనుగోలు చేశాడు. డబ్లిన్ ఫ్రాంచైజీ యాజమాన్య హక్కులను దక్కించుకున్నాడు. ఈ విషయాన్ని లీగ్ నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. అంతేకాకుండా లీగ్‌లోని ఫ్రాంచైజీల యాజమాన్యులతో కలిపి ఫోటో సెషన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాహుల్ ద్రవిడ్ హాజరయ్యాడు. డబ్లిన్ గార్డియన్స్ ఓనర్ రాహుల్ ద్రవిడ్ మాట్లాడుతూ.. యూరప్‌లో క్రికెట్ అభివృద్ధి, యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పించడం వంటివి తనను ఆకర్షించాయని తెలిపాడు. భారత మాజీ ఆల్–రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ గార్డియన్స్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ జట్టు బెల్ఫాస్ట్, ఎడిన్‌బరో, గ్లాస్గో, రోటర్‌డామ్, ఆమ్‌స్టర్‌డామ్ జట్లతో పోటీపడనుంది. ఈ కార్యక్రమానికి గ్లాస్గో ఫ్రాంచైజీకి చెందిన విపుల్ అగర్వాల్, రోటర్‌డామ్ ఫ్రాంచైజీకి చెందిన జోంటీ రోడ్స్, మధుకర్ శ్రీలతో పాటు, జుహూ సహ వ్యవస్థాపకులు అభిషేక్ బచ్చన్, సౌరవ్ బానర్జీ, ప్రియాంక కౌల్, ధీరజ్ మల్హోత్రా తదితరులు హాజరయ్యారు. క్రికెట్ ఐర్లాండ్, క్రికెట్ స్కాట్లాండ్, రాయల్ డచ్ క్రికెట్ అసోసియేషన్ల భాగస్వామ్యంతో యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్ నిర్వహించబడుతుంది.

ఈ లీగ్‌లో మిచెల్ మార్ష్, టిమ్ డేవిడ్, మిచెల్ సాంట్నర్, లియామ్ లివింగ్‌స్టోన్, గ్లెన్ మాక్స్‌వెల్, ఫాఫ్ డుప్లెసిస్, హెన్రిచ్ క్లాసెన్ వంటి అంతర్జాతీయ స్టార్లు పాల్గొంటారని భావిస్తున్నారు.




# అక్షర్ పటేల్‌కు రూ. 12 లక్షల జరిమానా

ఐపీఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్‌కు చేదు అనుభవం ఎదురైంది. సోమవారం పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు అద్భుత విజయాన్ని అందుకున్నప్పటికీ, కెప్టెన్ అక్షర్ పటేల్‌పై బీసీసీఐ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. స్లో ఓవర్ రేట్ కారణంగా అతనికి భారీ జరిమానా విధించింది. నిర్ణీత సమయంలోగా ఓవర్లు పూర్తి చేయడంలో విఫలమైనందుకు అక్షర్ పటేల్‌కు రూ. 12 లక్షల ఫైన్ పడింది. ఈ సీజన్‌లో అక్షర్ ఇలా ఫైన్ కట్టడం ఇదే మొదటిసారి. ఈ జరిమానాతో అక్షర్ పటేల్ ఇప్పుడు ఐపీఎల్ 2026లో శిక్షకు గురైన ఇతర కెప్టెన్ల క్లబ్‌లో చేరిపోయాడు. అక్షర్ కంటే ముందు శ్రేయస్ అయ్యర్, హార్దిక్ పాండ్యా, శుభ్‌మన్ గిల్, రుతురాజ్ గైక్వాడ్ వంటి స్టార్ కెప్టెన్లు కూడా ఇదే స్లో ఓవర్ రేట్ కారణంగా జరిమానాలు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఇప్పటికే రెండుసార్లు ఈ తప్పు చేసి భారీ మూల్యం చెల్లించుకున్నాడు. అక్షర్ పటేల్‌కు ఇది మొదటి తప్పు కావడంతో నిబంధనల ప్రకారం కనీస శిక్ష అయిన రూ.12 లక్షలతో సరిపెట్టారు. ఒకవైపు జరిమానా పడినా, మరోవైపు జట్టును గెలిపించిన ఆనందంలో అక్షర్ ఉన్నాడు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో ఢిల్లీకి గెలుపు అనివార్యమైన తరుణంలో అక్షర్ పటేల్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఈ సీజన్‌లో వరుసగా విఫలమవుతున్న అక్షర్, కీలక సమయంలో 56 పరుగుల అద్భుత హాఫ్ సెంచరీతో మెరిశాడు. అంతకుముందు ఆడిన మ్యాచ్‌లలో కనీసం రెండంకెల స్కోరు చేయడానికి ఇబ్బంది పడ్డ అక్షర్, ఒకేసారి 50 ప్లస్ స్కోరు సాధించి విమర్శకుల నోళ్లు మూయించాడు.

# కోహ్లీపై తప్పుడు ప్రచారం చేస్తే డబ్బులు ఆఫర్

## జర్మన్ మోడల్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ లిజ్లాజ్

జర్మన్ మోడల్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ లిజ్లాజ్ మరోసారి వార్తల్లోకెక్కింది. క్రికెటర్ విరాట్ కోహ్లి ఇన్‌స్టాగ్రామ్ 'లైక్' కాంట్రవర్సీ ఎపిసోడ్‌లో లిజ్లాజ్ తాజాగా షాకింగ్ విషయం ఒకటి బయటపెట్టింది. విరాట్‌పై నెగిటివ్ ప్రచారం చేస్తే భారీగా డబ్బులు ఇస్తామని తనకు కొన్ని మీడియా వెబ్‌సైట్లు ఆఫర్ చేశాయని చెప్పింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న లిజ్లాజ్ ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. లిజ్లాజ్ పోస్టుకు విరాట్ అకౌంట్ నుంచి లైక్ రావడంతో ఆమె ఒక్కసారిగా పాపులర్ అయ్యింది. అయితే ఇదే సందర్భంలో కొన్ని మీడియా వెబ్‌సైట్లు విరాట్ ఇమేజ్‌ను దెబ్బతీయాలని ప్రయత్నించినట్లు లిజ్లాజ్ ఆరోపించింది. కోహ్లీపై నెగిటివ్ ప్రచారం చేయాలని పలు మీడియా సంస్థలు తనను సంప్రదించాయని, అలా చేస్తే భారీ మొత్తంలో డబ్బులు ఇస్తామని చెప్పారని పేర్కొంది. అయితే డబ్బు కోసం ఒక వ్యక్తిపై తప్పుడు ఆరోపణలు చేసే మనిషిని తాను కాదని, అందుకే అలాంటి ఆఫర్లను తిరస్కరించినట్లు లిజ్లాజ్ తెలిపింది. 'విరాట్ కోహ్లీ గురించి తప్పుగా మాట్లాడాలని, అతడు ఏనాడు అనని మాటలు కూడా అన్నట్లుగా చెప్పాలని కొన్ని మీడియా సంస్థలు నన్ను సంప్రదించాయి. ఈ విషయంలో కొద్దిగా బలవంతం కూడా చేశాయి. అది నాకు అసౌకర్యంగా అనిపించింది. కానీ నేను ఎందుకు అలా చెబుతాను? డబ్బు కోసం అతడి ఇమేజ్‌ను నేనెందుకు దెబ్బతీయాలి? నేను అస్సలు అలాంటి వ్యక్తిని కాదు' అని లిజ్లాజ్ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. అయితే లిజ్లాజ్ వల్లే విరాట్ ఫేమస్ అయ్యాడంటూ కొన్ని కథనాలు ప్రసారం కావడంపై లిజ్లాజ్ రీసెంట్‌గా స్పందించింది. తన వల్ల విరాట్ ఫేమస్ అయ్యాడనడం 'హాస్యాస్పదం' అని చెప్పింది. ప్రపంచంలోనే ప్రముఖ అథ్లెట్లలో విరాట్ ఒకడని తెలిపింది. 'నా వల్ల విరాట్‌కు ఫేమ్ వచ్చింది అనడం హాస్యాస్పదం. అతను ప్రపంచంలోని ఫేమస్ పర్సనాలిటీల్లో ఒకడు. అది నేను చెప్పడం కాదు. అందరికీ తెలుసు. అయితే నేను ఒక విషయంలో స్పష్టత ఇవ్వాలనుకుంటున్నా. ఏంటంటే, జర్మనీలో క్రికెట్ అంతగా చూడరు' 'అందుకే జర్మన్ మీడియాలో



అతడు ఎక్కువగా కనిపించడు. కానీ నా పోస్టుకు లైక్ కొట్టిన కాంట్రవర్సీ వల్ల ఇక్కడి మీడియాలో అతడి పేరు వినిపించింది. అందుకే వాళ్లు అలా రాసినట్లున్నారు. అందుకే విరాట్ గురించి జర్మనీ మీడియాకు నేను వివరంగా చెప్పాను. అంతేకానీ నా వల్ల విరాట్ ఫేమస్ అయ్యాడని నేను ఎప్పుడూ చెప్పలేదు. చెప్పను కూడా' అంటూ మాట్లాడిన వీడియో ఒకటి లిజ్లాజ్ ఇన్‌స్టాలో షేర్ చేసింది. గతనెల లిజ్లాజ్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఓ పోస్టుకు విరాట్ కోహ్లీ అకౌంట్ నుంచి లైక్ వచ్చింది. అలా సింగిల్ లైక్‌తో ఆమె వరల్డ్‌వైడ్ ఫేమస్ అయ్యింది. అయితే తాను ఆమె పోస్టుకు ఉద్దేశపూర్వకంగా లైక్ కొట్టలేదని, అల్గారిథమ్ వల్లే అలా జరిగి ఉండొచ్చని ఆ తర్వాత విరాట్ కోహ్లీ క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశాడు. విరాట్ లైక్ కొట్టిన పోస్టు వైరల్‌గా మారింది. దీంతో ఆమెకు ఇన్‌స్టాలో ఫాలోవర్లు కూడా అమాంతం పెరిగారు. ప్రస్తుతం లిజ్లాజ్‌కు ఇన్‌స్టాలో 5 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. కానీ ఈ వ్యవహారంలో విరాట్‌పై ట్రోల్స్ వచ్చాయి.

# వీరభద్రుడు' థియేటర్స్ లో సెలబ్రేట్ చేసుకునే మంచి మాస్ మసాలా ఎంటర్‌టైనర్

## కచ్చితంగా ఆడియన్స్ ఎంజాయ్ చేస్తారు: ప్రీరిలీజ్ ఈవెంట్ లో హీరో సూర్య

## 'వీరభద్రుడు'లాంటి క్యారెక్టర్‌ను అన్నయ్య మాత్రమే చేయగలరు.. ఇలాంటి సినిమాలు థియేటర్‌లోనే చూడాలి: హీరో కార్తి

సూర్య మాగ్నమోపస్ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'వీరభద్రుడు'. త్రిష హీరోయిన్ గా నటిస్తోంది. ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించడం ద్వారా పేరును తెచ్చుకున్న నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ భారీ అంచనాలని సృష్టించాయి. ఈ చిత్రం ప్రతిష్టాత్మక అన్నపూర్ణ స్టూడియోస్ ద్వారా ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో రిలీజ్ అవుతుంది. మే 14న ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్ లో హీరో కార్తి, డైరెక్టర్ వెంకీ అట్లూరి, నిర్మాత సుప్రియా యార్లగడ్డ పాల్గొన్నారు. ప్రీరిలీజ్ ఈవెంట్ లో హీరో సూర్య మాట్లాడుతూ.. తెలుగు ప్రేక్షకులందరికీ నమస్కారం. నేను ఇక్కడికి వచ్చిన ప్రతిసారి చాలా అదృష్టవంతుడిగా భావిస్తాను. నాకు తెలుగు అంత బాగా రాకపోవచ్చు... కానీ తెలుగు వారి మనసు మాత్రం నాకు బాగా తెలుసు. సుప్రియ గారితో మాకు ఎప్పటినుంచో చాలా మంచి స్నేహం ఉంది. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ సినిమాను రిలీజ్ చేయడం చాలా గౌరవంగా భావిస్తున్నాం. ఇంత అద్భుతమైన ప్రమోషన్స్, రిలీజ్ ప్లానింగ్ చేస్తున్న అన్నపూర్ణ స్టూడియోస్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సినిమాతో ప్రేక్షకులు ఖచ్చితంగా చాలా సంతృప్తి పొందుతారు. రాకేందు మౌళి గారు చాలా చక్కని మాటలు రాశారు. రామజోగయ్య శాస్త్రి గారికి, శ్యామ్ గారికి థ్యాంక్యూ. చాలా మంచి పాటలు రాశారు. వాటికి మంచి స్పందన రావడం చాలా ఆనందంగా ఉంది. ఆర్.జే. బాలాజీ గారి జర్నీ ఎంతో స్ఫూర్తిదాయకం. ఆయన మల్టీ టాలెంటెడ్. ఈ కథను చాలా సిన్సియర్‌గా రాశారు... అంతే సిన్సియర్‌గా తెరకెక్కించారు. ఫస్ట్ హాఫ్ చాలా మంచి ఎమోషనల్ కోర్ట్‌రూమ్ డ్రామాగా సాగుతుంది. సెకండ్ హాఫ్ మాత్రం పూర్తి స్థాయి థియేటర్ మాస్ మసాలా మూమెంట్స్‌తో ఉంటుంది. చాలా మంచి హ్యూమర్, ఫన్ ఉంటాయి... ఇది నా ప్రామిస్. మే 14న ఈ సినిమా విడుదల అవుతోంది. ఈ సినిమాను నేను చాలా ఎంజాయ్ చేస్తూ చేశాను. ఆర్.జే. బాలాజీ, జీకే విష్ణు కలిసి నన్ను చాలా అద్భుతంగా ప్రజెంట్ చేశారు. ఈ మధ్యకాలంలో వచ్చిన నా సినిమాలన్నింటికంటే చాలా డిఫరెంట్‌గా చూపించారు. త్రిషతో 23 ఏళ్ల తర్వాత కలిసి పనిచేసిన సినిమా ఇది. తను చాలా అద్భుతంగా పెర్ఫార్మ్ చేసింది. విక్రమ్ గారు అద్భుతమైన యాక్షన్ సీక్వెన్స్‌లు డిజైన్ చేశారు. ఈ సినిమాకి పనిచేసిన ప్రతి ఒక్కరూ దీన్ని చాలా స్పెషల్‌గా ట్రీట్ చేసి పనిచేశారు. ఆ సిన్సియర్ ఎఫర్ట్ మీ అందరికీ సినిమాలో కనిపిస్తుంది. ఇది ఒక అద్భుతమైన ఎంటర్‌టైనర్. మీ ఆశీస్సులు, ప్రేమ మాకు కావాలి. మీ అందరి సపోర్ట్‌కి, అభిమానానికి హృదయపూర్వక ధన్యవాదాలు. హీరో కార్తీ మాట్లాడుతూ..అందరికీ నమస్కారం. మీ ప్రేమకి హృదయపూర్వక కృతజ్ఞతలు. షూటింగ్ జరుగుతుండగా ఇక్కడ 'రోలెక్స్' ఉన్నారని చెప్పారు. అందుకే హాయ్ చెప్పాలని వచ్చాను. ( నవ్వులు). ఈ సినిమా ఫస్ట్ లుక్ నాకు చాలా నచ్చింది. ఇది మాస్ మసాలా అలాగే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని కూడా చెప్పొచ్చు. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. ట్రైలర్‌ని నేను చాలా ఎంజాయ్ చేశాను. గజని డేస్ గుర్తుకు వచ్చాయి. ఇలాంటి క్యారెక్టర్‌ను అన్నయ్య మాత్రమే చేయగలరు. ఆ మాస్ ఆయనకే సాధ్యపడుతుంది. నేను తప్పకుండా తెలుగు వెర్షన్ కూడా చూస్తాను. ఇలాంటి సినిమాలు థియేటర్‌లోనే చూడాలి. సినిమాను సెలబ్రేట్ చేసుకునే ప్రేక్షకుల కోసం తీసిన చిత్రం ఇది. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను. అలాగే వెంకీతో చేస్తున్న సినిమా కూడా



మీ అందరి ప్రేమను అందుకోవాలని ఆశిస్తున్నాను. మీ అందరికీ ధన్యవాదాలు. డైరెక్టర్ వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఒక డివైన్ ఎలిమెంట్‌తో పాటు సోషల్ యాంగిల్‌ను అద్భుతంగా మిక్స్ చేసి ఆర్.జే. బాలాజీ గారు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమా అన్ని చోట్ల పెద్ద విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఆర్.జే. బాలాజీ గారి ప్రయాణం చాలా స్ఫూర్తిదాయకం. ఆయన ఆర్జేగా ప్రారంభించి, దర్శకుడిగా, నటుడిగా... ప్రతి పాత్రలోనూ అద్భుతంగా రాణించారు. సూర్య గారిని, కార్తి గారిని తెలుగు ప్రేక్షకులు ఎంతగానో అభిమానిస్తారు. వాళ్ల సినిమాలు తమిళంలో రిలీజ్ అయితే ఎంత పండగలా ఉంటుందో, తెలుగులో కూడా అంతే పండగ వాతావరణం ఉంటుంది. సూర్య గారు ఎంతో హంబుల్ హ్యూమన్ బీయింగ్. ఆయనతో దాదాపు 90 రోజులు పని చేసే అవకాశం వచ్చింది. ఆయన చేసే సమాజ సేవ కూడా అద్భుతంగా ఉంటుంది. ఈ సినిమా గొప్ప విజయాలు సాధించి, అద్భుతాలు క్రియేట్ చేయాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్ ఆర్.జే. బాలాజీ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. సూర్య గారి సినిమాలను తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకులు కూడా ఎంతో గొప్పగా సెలబ్రేట్ చేస్తుంటారు.

ఈ సినిమాను కూడా అన్ని భాషల ప్రేక్షకులు ఎంజాయ్ చేసేలా అద్భుతంగా తీర్చిదిద్దాం. దర్శకుడిగా నేను సూర్య గారితో సినిమా చేస్తానని కలలో కూడా అనుకోలేదు. నాకు ఈ అవకాశం ఇచ్చిన సూర్య గారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

ఈ సినిమాలో ఏముంటుందో ట్రైలర్‌లో కొంత మాత్రమే చూపించాం. సినిమాలో ఇంకా చాలా సర్ప్రైజ్‌లు ఉన్నాయి. ఇది పూర్తి స్థాయి ఎంటర్‌టైనింగ్ మాస్ మసాలా ఫిల్మ్. అభిమానులు చూడాలనుకునే సూర్య సార్‌ను ఈ సినిమాలో చూపించాం. సినిమాను సెలబ్రేట్ చేసుకునే ప్రేక్షకుల కోసం ఈ చిత్రాన్ని రూపొందించాం. ఈ సినిమాతో సూర్య గారికి ఒక బ్లాక్‌బస్టర్ ఇస్తానని నేను మాట ఇచ్చాను. ఖచ్చితంగా ఈ సినిమా మా నమ్మకాన్ని నిలబెడుతుంది. ఇది ఒక ఇంటెలిజెంట్ కమర్షియల్ ఫిల్మ్. సుప్రియ గారికి ధన్యవాదాలు. తెలుగు డైలాగ్స్‌ను రాకేందు మౌళి గారు అద్భుతంగా రాశారు. సాయి అభ్యంకర్ చాలా మంచి సంగీతం అందించారు. తప్పకుండా ఈ సినిమా మీ అందరినీ ఎంటర్‌టైన్ చేస్తుంది.



## బ్లాక్ బస్టర్ 'శంబాల' కాంబో రిపీట్..

### బృందా రవీందర్ దర్శకత్వంలో ఆది హీరోగా షైనింగ్ పిక్చర్స్, యగంధర్ ముని నూతన చిత్రం

సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ 'శంబాల'తో షైనింగ్ పిక్చర్స్ నిర్మాతలు మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభిమోజు, దర్శకుడు యుగంధర్ ముని, హీరో ఆది ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా నిలిచారు. 'శంబాల' లాంటి మరో వినూత్నమైన కథాంశంతో వీరంతా కలిసి ఓ ప్రయోగం చేయబోతోన్నారు.

యుగంధర్ ముని సమర్పణలో షైనింగ్ పిక్చర్స్ నిర్మాతలైన మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభిమోజు ఆదితో మరో సినిమాని నిర్మించనున్నారు. ఈ చిత్రానికి బృందా రవీందర్ దర్శకత్వం వహించనున్నారు. 'శంబాల' తరువాత మళ్లీ ఆ స్థాయిలో సినిమాని నిర్మించాలని వీరంతా కలిసి కథాన్వేషణలో పడ్డారు. ఇక అద్భుతమైన కథ తోడవ్వడంతో వీరంతా కలిసి ముందుకు వచ్చారు. ఎమోషన్స్‌తో పాటుగా ఈ సారి హారర్ ఎలిమెంట్స్‌ను సరికొత్తగా చూపించబోతోన్నారు. భయం, ఉత్కంఠ, అన్ లిమిటెడ్ ఎంటర్టైన్మెంట్, ఎమోషన్స్‌తో భారతీయ తెరపై మునుపెన్నడూ చూడని ఒక అద్భుతమైన అనుభూతిని అందించేందుకు టీం సిద్ధమైంది. ఈ క్రమంలో రిలీజ్ చేసిన కాన్సెప్ట్ పోస్టర్ అదిరిపోయింది. ఈ పోస్టర్‌లో ఆది సాయి కుమార్ ఇంటెన్స్ లుక్, రక్తం కారుతున్న తీరు, చుట్టూ ఉన్న పువ్వులు, ఆకులు, కనిపిస్తున్న పాత కాలం నాటి స్టాంప్ ఇవన్నీ చూస్తుంటే ఓ కొత్త ప్రపంచంలోకి ప్రేక్షకుల్ని తీసుకు వెళ్లేలా కనిపిస్తున్నారు. కాన్సెప్ట్ పోస్టర్‌తోనే ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ కథకి మ్యూజిక్ ప్రాణం అని, సౌండింగ్‌తోనే సరికొత్త ఎక్స్‌పీరియెన్స్ అందించాలని టీం భావిస్తోంది. ఈ క్రమంలోనే శ్రీ చరణ్ పాకాలని మ్యూజిక్ డైరెక్టర్‌గా మళ్లీ తీసుకున్నారు. ఆయన వినూత్నంగా, కొత్తగా సౌండ్–డిజైన్ పద్ధతులతో ప్రయోగాలు చేస్తుంటారన్న సంగతి తెలిసిందే. బీజీఎంతో ఉద్రిక్తతను పెంచుతూ, భావోద్వేగాలను రేకెత్తిస్తూ, నిశ్శబ్ద క్షణాలలో కూడా ప్రేక్షకులకు భయాన్ని కలిగిస్తామని టీం చెబుతోంది. ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

## జూన్ 12న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమైన "ఆర్ కే దీక్ష"

ఆర్ కె ఫిలిమ్స్, సిగ్ధ క్రియేషన్స్ బ్యానర్‌లపై డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శకత్వం వహించి నిర్మించిన చిత్రం "ఆర్ కే దీక్ష". డి.ఎస్ రెడ్డి సమర్పణలో రూపొందిన ఈ చిత్రంలో ఢీ, జోడి ఫేమ్ అక్స ఖాన్, అలేఖ్య రెడ్డి హీరోయిన్లుగా నటించగా, కిరణ్ హీరోగా కనిపించనున్నారు. తులసి, అనూష, కీర్తన, ప్రవల్లిక, రోహిత్ శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. తాజాగా ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని జూన్ 12న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ప్రెస్ మీట్ నిర్వహించింది. దర్శక నిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ "మా 'ఆర్ కే దీక్ష' సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. యాక్షన్ సన్నివేశాలు ఎక్కువగా ఉండటంతో సెన్సార్ వారు 'ఏ' సర్టిఫికెట్ జారీ చేశారు. పెద్దగా కట్స్ లేకుండా సర్టిఫికెట్ ఇచ్చిన అధికారులకు ధన్యవాదాలు. ఈ సినిమా చాలా బాగా వచ్చింది. దీక్ష, పట్టుదలతో ప్రయత్నిస్తే ఏదైనా సాధించగలమనే కాన్సెప్ట్‌తో హీరో పాత్రను తీర్చిదిద్దాం. హీరో కిరణ్ ఈ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంటారు. ఆయన భీముని పాత్రలో చెప్పిన వన్ మినిట్ నాన్ స్టాప్ డైలాగ్ హైలైట్ అవుతుంది. అక్స ఖాన్ ఈ చిత్రంలో డ్యాన్సర్ పాత్రలో కనిపిస్తుంది. ఆమెపై తెరకెక్కించిన 'నంది నంది' పాట ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. రోహిత్ శర్మ నెగిటివ్ రోల్‌లో నటించారు. అలేఖ్య రెడ్డి, అక్స ఖాన్ కాంబినేషన్‌లో తులసి మంచి పాత్ర చేశారు. సంగీత దర్శకుడు రాజ్ కిరణ్ అద్భుతమైన పాటలు అందించారు. మన వీర జవాన్ల గొప్పతనాన్ని తెలియజేసే పాటను మధుప్రియ ఆలపించారు. త్వరలోనే ఆడియో విడుదల చేస్తాం. మంచి కథను నమ్మి ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమాను నిర్మించాం. జూన్ 12న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. ఈ సినిమా తర్వాత మహిళా కబడ్డీ నేపథ్యంలో మరో చిత్రాన్ని ప్రారంభిస్తాం" అన్నారు.

హీరో కిరణ్ మాట్లాడుతూ – "నేను ఇప్పటికే పలు చిత్రాల్లో నటించాను. ప్రస్తుతం మూడు పాన్ ఇండియా సినిమాలు చేస్తున్నాను. 'ఆర్ కే దీక్ష'లో నటించడం ఆనందంగా ఉంది. ఇందులో పర్‌ఫార్మెన్స్‌కు మంచి స్కోప్ ఉన్న పాత్రలో కనిపిస్తాను. చిన్నప్పటి నుంచి దీక్షగా సినిమా ఇండస్ట్రీలో స్థిరపడాలని ప్రయత్నిస్తున్నాను. ఈ సినిమాలో కూడా అలాంటి పాత్రనే దర్శకుడు ఇచ్చారు. భీముని పాత్రలో చెప్పిన వన్ మినిట్ డైలాగ్ తర్వాత వచ్చే ఫైట్ సీన్ ప్రేక్షకులకు నచ్చుతుంది. యాక్షన్, రొమాన్స్, కామెడీ ఇలా అన్ని అంశాలు ఉన్న మా సినిమాను అందరూ ఆదరించాలి" అన్నారు. హీరోయిన్ అక్స ఖాన్ మాట్లాడుతూ – "ఈ చిత్రంలో నేను డ్యాన్సర్ పాత్రలో నటిస్తున్నాను. నిజ జీవితంలో



కూడా డ్యాన్సర్‌ను కావడంతో ఈ పాత్రకు బాగా కనెక్ట్ అయ్యాను. 'నంది నంది' పాట చాలా ప్రత్యేకంగా ఉంటుంది. మంచి ఫైట్స్ కూడా సినిమాలో ఉన్నాయి. నాకు ఈ అవకాశం ఇచ్చిన రామకృష్ణ గౌడ్ గారికి ధన్యవాదాలు. నా కోస్టార్ కిరణ్ ఎంతో ప్యాషన్‌తో పనిచేశారు. ఆయనకు మంచి భవిష్యత్తు ఉండాలి. జూన్ 12న మా సినిమా విడుదలవుతోంది. అందరూ చూసి సపోర్ట్ చేయాలి" అన్నారు. నటి తులసి మాట్లాడుతూ – "అక్స ఖాన్, అలేఖ్య రెడ్డి కాంబినేషన్‌లో నా సీన్స్ ఉంటాయి. ఈ సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాత రామకృష్ణ గౌడ్ గారికి ధన్యవాదాలు. మన సైనికుల ధైర్యసాహసాలను ప్రతిబింబించే పాట ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. మధుప్రియ పాడిన ఈ పాట ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. జూన్ 12న విడుదల కానున్న మా సినిమాను ప్రేక్షకులు విజయవంతం చేయాలి" అన్నారు. నటి మౌనిక మాట్లాడుతూ – "నేను క్లాసికల్ డ్యాన్సర్‌ను. ఆర్ కె ఫిలిమ్స్ బ్యానర్‌పై రూపొందిన 'ఆర్ కే దీక్ష' మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అన్నారు.

## పవర్, న్యాయం మధ్య పోరాటాన్ని తెలిపే 'SYSTEM' ట్రైలర్ విడుదల



ప్రైమ్ వీడియో తమ కొత్త ప్రైమ్ ఒరిజినల్ సినిమా SYSTEM ట్రైలర్‌ను విడుదల చేసింది. కోర్ట్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో పవర్, న్యాయం మధ్య జరిగే పోరాటాన్ని ఆసక్తికరంగా చూపించారు. ఈ చిత్రానికి అశ్విని అయ్యర్ తివారి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సోనాక్షి సిన్హా, జ్యోతిక, అశుతోష్ గోవరికేర్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమా మే 22 నుంచి ప్రైమ్ వీడియో లో మన దేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా 240కి పైగా దేశాల్లో స్ట్రీమింగ్ కానుంది. ట్రైలర్‌లో నేహా అనే యువ లాయర్ పాత్రలో సోనాక్షి సిన్హా కనిపించారు. తన తండ్రిలా ఫర్మ్‌లో పార్ట్నర్ కావాలని ఆశపడే ఆమె, తన ప్రతిభను నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఈ క్రమంలో కోర్ట్ స్టెనోగ్రాఫర్ సారిక పాత్రలో నటించిన జ్యోతికతో కలిసి పని చేస్తుంది. అయితే సారికకు కొన్ని గోప్యమైన ఉద్దేశాలు కూడా ఉంటాయి. కోర్ట్ సన్నివేశాలు, భావోద్వేగాలు, ఆలోచింపజేసే డైలాగులతో ట్రైలర్ ఆకట్టుకుంటోంది. "పవర్ ముందు నిజం నిలబడగలదా? న్యాయం గెలుస్తుందా?" అనే ప్రశ్నను సినిమా ప్రధానంగా చూపించబోతోంది. దర్శకురాలు అశ్విని అయ్యర్ తివారి మాట్లాడుతూ, నిజ జీవితానికి దగ్గరగా ఉండే కథతో ఈ సినిమా రూపొందిందని తెలిపారు. అలాగే సోనాక్షి సిన్హా, జ్యోతిక ఈ చిత్రం తమ నటనకు కొత్త సవాల్‌గా నిలిచిందని చెప్పారు.

1

## దూరదర్శని అందరి మనసులను హత్తుకుంటుంది: దర్శకుడు కార్తికేయ కొమ్మి

సువిక్షిత్, గీతికా రతన్ జంటగా ఓ యదార్థ సంఘటన ఆధారంగా రూపొందుతోన్న ఫీల్‌గుడ్ లవ్ ఎంటర్‌టైనర్ 'దూరదర్శిని'. కలిపింది ఇద్దరిని ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకత్వంలో వారాహ మూవీ మేకర్స్ పతాకంపై జయ శంకర్ రెడ్డి.ఎం, పాటిమీది సంతోష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అన్ని పనులను పూర్తిచేసుకున్న ఈ చిత్రం మే 15న విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం దర్శకుడు కార్తికేయ కొమ్మి చిత్ర విశేషాలను పంచుకున్నారు. ఆ విశేషాలివి.

**మీ నేపథ్యం ఏమిటి?**

ఇంతకు ముందు నేను సాధ్యం, వసూల్ రాజా, లక్ష్మీబాంబ్ సినిమాలకు దర్శకత్వం చేశాను. నేను కొత్తవాళ్లతో చేసిన తొలి ప్రాజెక్ట్ ఇది. యదార్థ సంఘటనతో చాలా రియలిస్టిక్‌గా ఈ సినిమాను రూపొందించాను.

**దూరదర్శని కథ ఏమిటి?**

కథగా చెప్పుకుంటే పేరెంట్స్ చాయిస్, సొసైటీ చాయిస్, పిల్లల చాయిస్.. వీటి మధ్య ఉండే క్లాష్.. ఈ చిత్ర కథాంశం.

చిత్రలహరి టైమ్ పిరియడ్ మిస్ అయిన వారికి. ఆ టైమ్‌లో చిత్రలహరి అనుభూతిని పొందిన వారికి ఈ సినిమా పూర్తి సంతృప్తినిస్తుంది. చిత్రలహరి గురించి అందరూ ఎలా వెయిట్ చేసే వారు.. అక్కడ జరిగే ప్రేమకథ. చిత్రలహరి అనేది గ్యాదరింగ్ పాయింట్‌లా ఎలా ఉండేది. అందరూ ఇది కేవలం లవ్‌స్టోరీ అనుకుంటున్నారు. కానీ ఈ చిత్రంలో తల్లిదండ్రులకు, యూత్‌కు, సమాజానికి నచ్చే అంశాలు ఉన్నాయి. అందరికి 90వ దశకం రోజులను గుర్తకు తెస్తుంది. అందరూ చిత్రలహరి పోగ్రామ్ కోసం వేచి చూసిన రోజులు గుర్తుకు వస్తాయి. ఈ సినిమాలో మంచి ఎమోషన్ ఉంది. అందరి హృదయాలను హత్తుకుంటుంది. సినిమా చూసిన ప్రతి ఒక్కరికి వాళ్ల గోల్డెన్ డేస్‌లోకి తీసుకవెళుతుంది.

**ఇటీవల తిమ్మరాజు పల్లి టీవీకి అనే సినిమా వచ్చింది ఆ సినిమాతో ఏమైనా పోలీకలు ఉంటాయా?**

కథ విషయంలో ఆ సినిమాకు ఈ సినిమాకు సంబంధం లేదు. ఇది కంప్లీట్ ఎమోషన్ సినిమా. ఫాదర్, సన్‌కు మధ్య ఉన్న ఎమోషన్.. ఈ సినిమాలోని ప్రతి సన్నివేశం మీ హృదయాలకు హత్తుకుంటుంది.

**అరుణాచలంలో బిక్షాటన చేస్తున్న ఓ వ్యక్తి జీవిత కథ ఈ సినిమా అంటున్నారు?**

ఆంధ్రా లో జరిగిన ఒక రియాల్ ఇన్‌సిడెంట్ ఇది. ఇప్పుడు ఆ వ్యక్తి అతను అరుణాచలంలో ఉన్నాడు. అతని జీవితంలో జరిగిన కథను స్ఫూర్తిగా తీసుకుని ఈ కథను తయారుచేశాం. ఆయనతో మాట్లాడినప్పుడు ఆయన చెప్పిన లైఫ్ స్టోరియే సినిమా ఇది. ఆయన సొంత కొడుకు వల్ల ఆ పెద్దాయన బిక్షాటన చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది అనేది ఈ కథ. యదార్థ సంఘటన చుట్టు అల్లుకున్న కథ ఇది.

**సినిమా రియల్‌స్టిక్‌గా ఉంటుందా? లేదా సినిమాటిక్ లిబర్టి తీసుకున్నారా?**

సినిమాటిక్‌గా చాలా తక్కువగా ఉంటుంది. చాలా రియలిస్టిక్‌గా ఉంటుంది. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో జరిగే ప్రేమకథ. అందరూ పల్లెటూరులో విహరించిన అనుభూతి కలుగుతుంది. అందరికి పాత జ్ఞాపకాలు గుర్తుకుతెస్తుంది' అన్నారు.

**సాధారణంగా ఇలాంటి లవ్‌స్టోరీస్‌కు పతాక సన్నివేశాలు హైలైట్ అవుతుంటాయి? ఈసినిమాలో పతాక సన్నివేశాలు ఎలా ఉంటాయి?**



ఈ సినిమా పతాక సన్నివేశాలు అందర్ని ఆలోచింపజేస్తాయి. సినిమా చూసిన వచ్చిన తరువాత ఆ ఫీల్ మిమ్ములను వదిలివెళ్లదు' అన్నారు.అందరూ ఓ మంచి సినిమా చూశామన్న అనుభూతితో థియేటర్ నుంచి బయటికొస్తారు.

**హీరో, హీరోయిన్ చనిపోతారని చెప్పారు. ఎందుకని? ఇలా చెబితే సినిమాపై ఆసక్తి తగ్గుతుంది కదా?**

స్క్రీన్‌ప్లేలో ఉండే మ్యాజిక్ ఇది. ఫైనల్‌గా ఎలా హ్యాపీ ఎండింగ్ అనేది ఉంటుంది. ఓవరాల్‌గా తల్లిదండ్రుల ఎమోషన్ బాగా కనెక్ట్ అవుతుంది.

**హీరో, హీరోయిన్ పర్‌ఫార్మెన్స్ ఎలా ఉంటుంది?**

కొత్తవాళ్లతో చేసే అవకాశం రావడం థ్రిల్లింగ్‌గా అనిపించింది. ఈ మూవీకి హీరో, హీరోయిన్ పర్‌పార్మెన్స్ హైలైట్‌గా ఉంటుంది. వాళ్ల నటనతో సినిమాను మరో మెట్టు ఎక్కించారు.

**మీ తదుపరి చిత్రం?**

ఆగస్టులో ఓ పెద్ద ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహించబోతున్నాను.

Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 68-5-1/1,Near Municipal Complex , Patamata,N.T.R , Andhra Pradesh-520010 .Editor : Sudheer kumar katepally ph: 9000657700, PRGI NO: APTEL/26/A2264